TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:21 SUNDAY ,MAY 31,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 21 ఆదివారం 31 మే 2026 పేజీలు :8 వెల: 4/-

# బాల్క సుమన్ పై పీడీ యాక్ట్ పెట్టాలి: ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్



హంసకలం వార్త మే 30

సింగరేణి పై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం తెలంగాణ రాజకీయాల్లో దుమారం రేపింది. ఈ పరిణామం పై ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి ఆయన చేసిన వ్యాఖ్యలే కారణమని, దీని వెనుక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుట్ర దాగి ఉందని వెంకట్ ఆరోపించారు. "మీకు కోపం ఉంటే మా పై దాడి చేయండి, కానీ సామాన్య పేద ప్రజలు ప్రయాణించే రైళ్ల పై మీకెందుకు అంత అక్కసు? మీకు ఓట్లేయలేదనే కక్షతోనే పేదల పై ఇలాంటి - మిగతా2లో

# రైతు ముసుగులో కేసీఆర్ రాజకీయం: సీఎం రేవంత్ రెడ్డి



హంసకలం వార్త మే 30

తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో - మిగతా2లో

# అమెరికా డిమాండ్లు నెరవేరాల్సిందే.. ఇరాన్‌తో ఒప్పందం పై సంతకం చేయని ట్రంప్..

హంసకలం వార్త మే 30

ఇరాన్‌తో ఒప్పందానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకా తుది ఆమోదం తెలపలేదు. ఇరాన్‌తో ఘర్షణ ముగించే ఒప్పందంపై ఆయన ఇంకా సంతకం చేయలేదు. ఇరాన్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా అమెరికా నిర్దేశించిన కీలక షరతులకు అనుగుణంగా ఉండాల్సిందేనని ట్రంప్ స్పష్టం చేసినట్లు వైట్ హౌస్ వర్గాలు వెల్లడించాయి. - మిగతా2లో



# మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

హంసకలం వార్త మే 30

దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని - మిగతా2లో



# గోదావరిఖనిలో పర్యటించిన బండారు దత్తాత్రేయ

హంసకలం వార్త మే 30

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించిన సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిన ఉదంతం పై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే ఒక స్పష్టమైన నివేదికను ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. - మిగతా2లో



# సింగరేణి పై వ్యాఖ్యలు.. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్



- సింగరేణి పై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు
- డీజీపీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు

2

# జూన్ 3న సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం

హంసకలం వార్త మే 30

డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. జూన్ 3వ తేదీ సాయంత్రం 5:15 గంటలకు ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. వాస్తు నిపుణులు గురూజీ ఆరాధ్య స్వయంగా ఈ ముహూర్తాన్ని నిర్ణయించినట్లు శనివారం ప్రకటించారు. - మిగతా2లో



# నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు

హంసకలం వార్త మే 30

తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత రాజుకున్నాయి. ముషీరాబాద్ నియోజక వర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వం పై తనదైన శైలిలో విమర్శల జడివాన కురిపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ కేటీఆర్ - మిగతా2లో



# అధికారంలోకి రాగానే 111 జీవో ఎత్తి వేస్తాం టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

హంసకలం వార్త మే 30

తమ పార్టీ అధికారంలోకి రాగానే 111 జీవో ఎత్తివేస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చెప్పారు. ఈ జీవో కారణంగా బాధ పడుతున్న వారందరికీ ఉపశమనం కలిగిస్తామన్నారు. టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మొయినాబాద్ లో ఏర్పాటు చేసిన జెండా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. - మిగతా2లో



# అమెరికా డిమాండ్లు నెరవేరాల్సిందే..

## ఇరాన్‌తో ఒప్పందం పై సంతకం చేయని ట్రంప్..

-మొదటిపేజీ తరువాయి

దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇప్పట్లో ముగిసేలా కనబడడం లేదు. ఇరాన్‌తో ఒప్పందంపై చర్చించేందుకు, తుది నిర్ణయం తీసుకునేందుకు ట్రంప్ వైట్‌హౌస్ సిచ్యువేషన్ రూమ్‌లో తన సలహాదారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశం దాదాపు రెండు గంటల పాటు జరిగింది. అయినప్పటికీ ఆ ఒప్పందంపై ట్రంప్ ఇప్పటివరకు అధికారికంగా సంతకం చేయడం గానీ, తుది ఆమోదం ప్రకటించడం గానీ జరగలేదు. ఈ డీల్‌పై సంతకం చేయకుండానే ట్రంప్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించిన కొన్ని నిబంధనలపై ఇరాన్ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. ముఖ్యంగా యురేనియం నిల్వలను పూర్తిగా వదులుకోవాలనే అమెరికా డిమాండ్‌కు ఇరాన్ పూర్తిగా అంగీకరించలేదని సమాచారం. ఈ నేపథ్యంలో ట్రంప్ ఈ డీల్‌పై పూర్తి సంతృప్తిగా లేరట. ఇరాన్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా అది అమెరికాకు మేలు చేసిదిగా ఉండాలని, అధ్యక్షుడు ట్రంప్‌ను సంతృప్తిపరచాలని, అప్పుడే ఆయన తుది ఆమోదం తెలుపుతారని వైట్‌హౌస్ అధికారి తెలిపారు.

# గోదావరిఖనిలో పర్యటించిన బండారు దత్తాత్రేయ

-మొదటిపేజీ తరువాయి

దాదాపు లక్ష కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు గానీ, ప్రజలకు గానీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని దత్తాత్రేయ విమర్శించారు. ఇంత పెద్ద ప్రాజెక్టు నిరుపయోగంగా మారినప్పటికీ, దానికి అవసరమైన అత్యవసర మరమ్మతులు చేపట్టడంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి సరైన చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకపోవడం వల్ల జరుగుతున్న నష్టాన్ని దత్తాత్రేయ వివరించారు. కాళేశ్వరం నీటిపై ఆధారపడిన ఉత్తర తెలంగాణ జిల్లాల రైతులు ప్రస్తుతం సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మూడు ప్రధాన బ్యారేజీల్లో ప్రస్తుతం బొట్టు నీరు కూడా లేకపోవడం అత్యంత ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా కాలయాపన చేయకుండా తక్షణమే స్పందించి, కాళేశ్వరం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిపుణుల సూచనల మేరకు పనులను వేగవంతం చేసి, ఉత్తర తెలంగాణ రైతాంగానికి సాగునీరు అందించే బాధ్యతను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్వీకరించాలని బండారు దత్తాత్రేయ హితవు పలికారు.

# జూన్ 3న సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం...

-మొదటిపేజీ తరువాయి

శివకుమార్ నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన గురూజీ ఆరాధ్య, జూన్ 3 బుధవారం రోజు వృశ్చిక లగ్నంలో ప్రమాణ స్వీకారానికి శుభప్రదంగా ఉంటుందని తెలిపారు. వాస్తవానికి జూన్ 5వ తేదీని పరిశీలించినా, ఆ రోజు ఓ ముఖ్యమైన వ్యక్తి అందుబాటులో ఉండరన్న కారణంతో జూన్ 3ని ఖరారు చేసినట్లు ఆయన వివరించారు. శివకుమార్ జాతకానికి సంబంధించిన జ్యోతిష్యపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ బెంగళూరులోని అజ్జయ్య మఠాన్ని సందర్శించి స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను కలిసిన అనంతరం ఆయన స్వామీజీతో భేటీ అయినట్లు సమాచారం. మరోవైపు, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా డీకే శివకుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిద్ధరామయ్య సీఎల్పీ నేతగా (తదుపరి సీఎంగా) డీకేఎస్ పేరును ప్రతిపాదించగా, కాంగ్రెస్ సభ్యులు బలపడరిచారు.

# సింగరేణి పై వ్యాఖ్యలు.. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టయ్యారు. సింగరేణిపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లుగా ఫిర్యాదు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈరోజు అతనిని అదుపులోకి తీసుకుని, కోర్టుకు తరలించారు. ఇటీవల పార్టీ కార్యక్రమంలో మాట్లాడిన మాటలు వివాదాస్పదమయ్యాయి. దీంతో బాల్క సుమన్‌ను వెంటనే అరెస్టు చేయాలని, ఆయన లాంటి వ్యక్తులు సమాజంలో ఉండకూడదని కాంగ్రెస్ నాయకులు డీజీపీకి లేఖ ఇచ్చారు.

**బాల్క సుమన్ ఏమన్నారు?**

బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిరసనలు తెలిపేందుకు రైతులు, కార్మికులు రావడం లేదని వ్యాఖ్యానించారు. కాబట్టి బీఆర్ఎస్ నాయకులే మిలిటెంట్ తరహా ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. అవసరమైతే రోడ్లపై గొడవలు చేయాలని, సింగరేణి కార్యాలయాన్ని, ఆస్తులను ధ్వంసం చేయాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఆయన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని పలువురు మండిపడ్డారు. సింగరేణి జీఎం కార్యాలయం, సింగరేణి భవన్ తగులబెట్టాలని బాల్క సుమన్ పిలుపునిచ్చారని, ఇది సరికాదని కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ కూడా ఆందోళన వ్యక్తం చేసింది.

# నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు

-మొదటిపేజీ తరువాయి

రైతుబంధు నిలిచిపోతుందని గతంలో కేసీఆర్ చెబితే.. 'మేమేమన్నా దీవానాగాళ్లమా.. మాకు ధిమాక్ లేదా' అని ఒకాయన మాట్లాడారు. మరి ఇవాళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా, ఇప్పటికే నాలుగుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారు. మరి ఇప్పుడు నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు తాను తిట్టిన తిట్ల కంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలను తిడుతున్నారని, ఎక్కడైనా దొరికితే తన్నేలా ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వడ్లు కొనడం లేదని, యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు కష్టపడి పంట పండిద్దామంటే అటు రైతుబంధు వేయడం లేదని, ఇటు కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని, గ్రామాల్లో రైతులు చెప్పలేని గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన జిల్లాల ప్రజలంతా తిరుగుబాటు మూడ్‌లో ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు తరిమికొడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

# అధికారంలోకి రాగానే 111 జీవో ఎత్తివేస్తాం

-మొదటిపేజీ తరువాయి

అనంతరం పార్టీ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ లక్ష్యాల కోసం తెలంగాణ సాధించుకున్నామో ఆ లక్ష్యాలను గత 12 ఏళ్లలో సాధించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను పరిరక్షించుకునేందుకే టీఆర్ఎస్ ఏర్పాటు చేశామన్నారు. 111 జీవో పరిధిలోని బాధితులందరికీ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత గుడ్ న్యూస్ చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే ఈ జీవో ను ఎత్తివేస్తామన్నారు. ఇతర పార్టీల మాదిరిగా తాము మోసం చేయమని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ లు ఇక్కడి ప్రజలకు 111 జీవో ఎత్తేస్తామంటూ మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశాయని విమర్శించారు. 111 జీవో పరిధిలో ఉన్న 120 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. చుట్టు పక్కల భూములు ఎకరాకు వంద కోట్లకు పైగా ధర పలుకుతుంటే 111 జీవో పరిధిలోని ప్రజలు మాత్రం తమ భూములను ఎక్కువ రేటుకు అమ్ముకోలేని పరిస్థితి ఉందన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం భూమి అమ్మితే సమస్యలు తీరుతాయని భావించినప్పటికీ ఈ జీవో అడ్డంకిగా ఉందన్నారు. గుంపు మేస్త్రీ తనకు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కటే తెలుసని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ వ్యాపారాన్ని ఊడగొట్టారని మండిపడ్డారు. చేవెళ్ల, మొయినాబాద్ లో ఎక్కువగా రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉంటారని వారికి మేలు చేసేలా ఈ ప్రభుత్వం ఏమీ చేయటం లేదని మండిపడ్డారు. అందుకే గుంపు మేస్త్రీ పై పోరాటానికి ఈ ప్రాంత ప్రజలంతా ముందుకు రావాలని కోరారు. తెలంగాణ వచ్చాక అన్ని సమస్యలు తీరుతాయని భావిస్తే అలా జరగలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఏ లక్ష్యాల కోసం రాష్ట్రం సాధించుకున్నామో ఆ లక్ష్యాలతో పాటు తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసమే తాము కొత్త రాజకీయ శక్తిగా పుట్టుకొచ్చామన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆడబిడ్డల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆడబిడ్డగా, మీ సోదరిగా మీకు ఏం కావాలో నాకు తెలుసు. తప్పకుండా మన పార్టీ ద్వారా మహిళలకు మంచి జరుగుతుందని హామీ ఇస్తున్నా అన్నారు. అదే విధంగా యువత కోసం ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. సృజనాత్మక ఆలోచన కలిగిన యువత వ్యాపారం చేసేలా ప్రోత్సహించేందుకు వారికి ఎలాంటి గ్యారంటీ లేకుండా 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. చేవెళ్ల, మొయినాబాద్ నుంచి మైనార్టీలు పెద్ద ఎత్తున చేరటంతో ఈ ప్రాంతంలో పార్టీ మరింత బలపడిందని చెప్పారు. ఇక్కడి గంగా జమున తెహజీబ్ ను చెడగొట్టే ప్రయత్నం చేస్తున్న వాళ్లకు బుద్ధి చెప్పాల్సిన అవసరముందని కవిత అన్నారు.

## రైతు ముసుగులో కేసీఆర్ రాజకీయం: సీఎం రేవంత్ రెడ్డి

-మొదటిపేజీ తరువాయి

పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్తే, తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం, హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## బాల్క సుమన్ పై పీడీ యాక్ట్ పెట్టాలి: ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

-మొదటిపేజీ తరువాయి

కుట్రలు చేస్తున్నారా?" అని ఆయన ప్రశ్నించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపినట్లు గుర్తుచేశారు. కేసీఆర్ ఒక్కొక్కరికి ఒక్కో వివాదాస్పద బాధ్యత అప్పగించారని.. సుమన్‌కు రైలు పట్టాలు కోసే శాఖ ఇచ్చారని వెంకట్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించేందుకు బీఆర్ఎస్ యత్నిస్తోందని, సుమన్ లాంటి వ్యక్తుల పై పీడీ యాక్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు.

## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

-మొదటిపేజీ తరువాయి

మోదీ పై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు. సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్ట పరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ,ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు. భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.

## గాదె వెంకటరెడ్డి మృతి పై రేవంత్ సంతాపం

హంసకలం వార్త మే 30



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి (85) మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, శుక్రవారం హైదరాబాద్ లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాదె వెంకటరెడ్డి రాజకీయాల్లో అత్యంత సౌమ్యుడు, సహనశీలిగా పేరుగాంచారని, ఆయన హయాంలో ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారని రేవంత్ కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర శాసనసభకు ఐదుసార్లు ప్రాతినిధ్యం వహించిన ఆయన, మంత్రిగా వివిధ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారని గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో ఆయన లేని లోటు తీర్చలేనిదని సీఎం పేర్కొన్నారు. 1940 జులై 10న ప్రకాశం జిల్లా పావులూరులో జన్మించిన గాదె వెంకటరెడ్డి న్యాయశాస్త్రం అభ్యసించారు. ప్రజాసేవపై ఉన్న ఆసక్తితో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1967లో పర్చూరు నియోజకవర్గం నుండి తన 27వ ఏటనే తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 1991 (ఉప ఎన్నిక), 1994లో పర్చూరు నుండి, అలాగే 2004, 2009లలో బాపట్ల నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా విజయం సాధించారు. ఉమ్మడి ఏపీలో అగ్ర నేతలైన నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్యల మంత్రివర్గాల్లో దేవాదాయ శాఖతో పాటు పలు కీలక శాఖల మంత్రిగా ఆయన సమర్థవంతంగా సేవలందించారు. కాంగ్రెస్ తర్వాత ఆయన తెలుగుదేశం పార్టీ, వైసీపీలలో కూడా కొనసాగారు. ఒక విలువలతో కూడిన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని ముగించి నిష్క్రమించిన గాదె వెంకటరెడ్డి మృతి పట్ల రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# సంపాదకీయం

## దేశీయ ఆయుర్వేద దార్శనికుడు

సమాజానికి ఎంతో ఉపకారం చేసిన కొందరు పెద్దలు మహా నిశ్శబ్దంగా నిష్క్రమిస్తుంటారు. అటువంటి కోవకు చెందినవారే మోటూరి కృష్ణప్రసాద్ (64). ఈ నెల 19న ఆయన తనువు చాలించారు. బాల్య స్నేహితులు, కుటుంబసభ్యులు, వివిధ రంగాల ప్రముఖులు, వామపక్ష పార్టీల ప్రతినిధులు ఆయనకు అంతిమ నివాళులు అర్పించారు. ఆయుర్వేదంతో కొన్ని రకాల బయో మాలిక్యులర్ ఔషధాలు తయారుచేసిన మన కాలపు ధన్వంతరి. క్యాన్సర్‌కి, మోకాళ్ల నొప్పుల ఉపశమనానికి ఆయన విశేష ప్రయోగాలు చేసి ఔషధాలు రూపొందించారు. కరోనా కాలంలో మూలికా వైద్యంతో ఆయన సాధించిన అద్భుత ఫలితాల గురించి ఎంత చెప్పినా తక్కువే. కృష్ణప్రసాద్ తల్లి వెంకటరత్నమ్మ, తండ్రి అప్పలనర్సయ్య చౌదరి. వారి స్వస్థలం కృష్ణా జిల్లాలోని కొమరవోలు. కానీ స్థిరపడింది హైదరాబాద్‌లోని పురానాపూల్ ప్రాంతంలో. కృష్ణప్రసాద్ ఇక్కడే పుట్టి పెరిగారు. పాతబస్తీలోని సెంట్ మార్క్స్ బాయిస్ టౌన్ హైస్కూల్లో చదివారు. కోఠీలోని చైతన్య కళాశాలలో ఇంటర్ బైపీసీ చేశారు. ఆ సమయంలో ఏఐఎస్ఎఫ్‌లో చేరి చురుకైన కార్యకర్తగా వ్యవహరించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ స్పిన్నింగ్ మిల్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొన్నాళ్లు వ్యవహరించారు. వివిధ రంగాల్లో అనేక కంపెనీలను నెలకొల్పిన కృష్ణప్రసాద్, ఆ తర్వాత 'ట్రైడెంట్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థని స్థాపించి టాటా స్టీల్స్‌కి 'సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్' రిపోర్టులు తయారుచేసే బాధ్యతలు స్వీకరించారు. ఇలా ఒకటి కాదు- బహు రూపాల్లో ఆయన కృషి కొనసాగింది. నిజానికి ఆయన జీవనయానంలో 2008 అత్యంత కీలక సంవత్సరం. ఆ ఏడాది ఆయనకు డయాబెటిక్ న్యూరోపతి వచ్చి కదలలేని స్థితి వచ్చింది. దానికి సరైన మందులు లేక తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. సైన్స్ విద్యార్థి కావడంతో పాటు ప్రాచీన భారత ఆయుర్వేదం పట్ల అపారమైన గురి ఉండటంతో బయో మాలిక్యులర్ మెడిసిన్స్ దిశగా పరిశోధనలు మొదలుపెట్టారు. తనే లాబొరేటరీగా, తన శరీరమే క్లినికల్ ట్రయల్స్‌కి వేదికగా అనేక ప్రయోగాలు చేసి 2010 నాటికి మందు తయారుచేసి, వాడారు. మళ్లీ నడక వచ్చింది. తర్వాత ఆ మందు వాడిన ఎందరో కోలుకున్నారు. అలా ఆయుర్వేదంతో ప్రయాణం మొదలుపెట్టి క్యాన్సర్‌కి, కీళ్లనొప్పులకి ఉపశమన మందులు తయారుచేశారు. మంచి ఫలితాలతో పాటు ప్రచారమూ లభించింది. పేదలకు ఉచితంగా లేదా స్వల్ప రుసుముతో మందులు అందించాలన్నది ఆయన ప్రధాన ధ్యేయం. ఇదంతా ఒక ఎత్తయితే ప్రపంచంపై కొవిడ్ విజృంభణ మొదలు కాక ముందు అంటే- 2019 సెప్టెంబర్ ప్రాంతంలో కృష్ణప్రసాద్ సన్నిహితులు ఇద్దరికి జ్వరం,- దగ్గు-, తలపోటు-, ఒళ్లు నొప్పులు వచ్చి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతకు ముందు వారు చైనాలో పర్యటించి వచ్చారు. కృష్ణప్రసాద్‌ని సంప్రదిస్తే ఆయన వారికి ఒక కషాయం తయారుచేసి ఇచ్చారు. అది బాగా పనిచేసింది. మూడు రోజుల్లోనే వారిద్దరూ పూర్తిగా కోలుకున్నారు. చైనా వెళ్లి వచ్చిన మరో ఐదారుగురు కూడా ఆ మందుతో తెరిపినపడ్డారు. 2019 చివరిలో చైనాని వణికించిన కరోనా వైరస్ 2020 జనవరి నాటికి ప్రపంచమంతా విస్తరించింది. మన దేశంలో లాక్‌డౌన్ ప్రకటించారు. జనజీవితం స్తంభించిపోయింది. కృష్ణప్రసాద్ తయారుచేసిన మందు కరోనా వైరస్‌ని తట్టుకునేలా రోగనిరోధక శక్తిని పెంచుతోందని ఆ నోటా ఆ నోటా తెలుసుకున్న చాలా మంది ఆ మందు వాడారు. ఉపశమనం కనిపించింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా కొవిడ్ మందుకి బాగా డిమాండ్ ఉందన్న విషయాన్ని కృష్ణప్రసాద్ గ్రహించారు. ప్రత్యేక శ్రద్ధతో అస్సోం, ఉత్తరాఖండ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు శేషాచలం వంటి దట్టమైన అడవుల నుంచి ఔషధ గుణాలున్న మూలికలు తెప్పించి భారీ స్థాయిలో ఉత్పత్తి మొదలుపెట్టారు. కొవిడ్ కిట్ రూపొందించారు. సన్నిహిత మిత్రుల సహకారంతో పంపిణీని చేపట్టారు. ఆయన తయారుచేసిన కొవిడ్ మందు సమర్థతని సీసీఎంబీ ధృవీకరించింది. కృష్ణప్రసాద్ స్వయంగా కొవిడ్ మందుల తయారీ కోసం 'బయోగ్రీన్ రెమిడీస్ ప్రైవేట్ లిమిటెడ్', 'మెడ్యూర్' అనే కంపెనీలు స్థాపించారు. సొంత వనరులు ఉపయోగించి మందులు తయారుచేసి తన మిత్రబృందం ద్వారా పంపిణీ చేశారు. ఎవరికి వారు సొంత ఖర్చులతో అనేక ప్రాంతాలకు వెళ్లి కొవిడ్ నివారణ మందులు అందజేసేవారు. లాక్‌డౌన్‌లో రవాణాకి అనుమతులు ఉన్న వాహనాల డ్రైవర్లు, గూడ్స్ ట్రైన్ డ్రైవర్లు, గార్డుల ద్వారా కూడా పంపిణీ చేసేవారు. కొవిడ్ పాసులు సంపాదించి సొంత వాహనాల్లో తిరుగుతూ మందులు పంచేవారు. ఆసుపత్రుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేషెంట్లకి కూడా ఈ మందు అందేలా చేశారు. వేలాది మందికి ఇదొక 'బయో వ్యాక్సిన్' మాదిరిగా పనిచేసింది. టాలీవుడ్‌కి చెందిన ఎందరో ప్రముఖులు ప్రత్యేకంగా ఫోన్ చేసి మరీ ఈ మందు తెప్పించుకుని వాడిన సందర్భాలున్నాయి. ఆయన తయారుచేసిన మందు 22 రకాల వైరస్‌ల ప్రభావాన్ని నియంత్రిస్తుందని కొందరు పరిశోధకులు చెప్పారు! ఏమీ ఆశించకుండానే ఇంత గొప్ప సేవ చేసిన కృష్ణప్రసాద్ లాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారు. గుండెపోటు వల్ల ఆయన మనందరికీ దూరమయ్యారు. మన దేశం కంటే ముందే ఇతర దేశాలవారు ఆయన ఘనతని గుర్తించారు. గత ఏడాది మలేసియా యూనివర్శిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. లండన్‌కి చెందిన ఒక సంస్థ ఆయనను 'బెస్ట్ బయో మాలిక్యులర్ మెడిసిన్స్ ఇన్వెంటర్' అనే అవార్డుతో సత్కరించింది. 'లివ్ లైఫ్ కింగ్ సైజ్' పేరుతో కృష్ణప్రసాద్ ఆంగ్లంలో ఓ పుస్తకం రాశారు. దానిని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆవిష్కరించారు. తను ఏ పనిలో ఉన్నా సరే సామాజిక ఉద్యమాలవైపు కృష్ణప్రసాద్ ఓ చూపు ఉంచేవారు. ఆ మధ్య ఖమ్మం జిల్లాలోని భూదాన్ భూముల పరిరక్షణ కోసం జరిపిన రౌండ్ టేబుల్ సమావేశంలో గట్టిగా గొంతెత్తారు. ఇండియన్ నేషనల్ యాక్టివిస్ట్స్ మూమెంట్ అనే సంస్థకి ఆయన జాతీయ అధ్యక్షులుగా కొనసాగారు.

# మోదీని రాహుల్ జయించగలడా









గత సార్వత్రిక ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులకు యువ కాంగ్రెస్ శాసనసభ్యుడు ఒకరు నాకు తటస్థించారు. తమ నాయకుడు రాహుల్‌గాంధీకి ఐదు సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. నేను ఇవ్వగల సలహా ఒక్కటే ఉన్నదని చెప్పాను: వయనాడ్ నుంచి లోక్‌సభకు ప్రియాంకగాంధీ పోటీ చేయకూడదు. నా యీ సలహాను నిర్లక్ష్యం చేస్తారని నిశ్చితంగా చెప్పగలను అని ముక్తాయించాను. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ఆయన నాయకత్వం పట్ల విశ్వసనీయతను పెంపొందించి ఒదనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా భాసించారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ జమీగా అయిపోవడంతో భారత్ జోడో యాత్ర సత్ఫలితాలు వ్యర్థమైపోయాయి. ప్రియాంకగాంధీ వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక వాగాడంబరం ప్రదర్శించారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను ప్రధానమంత్రి కాబోయే వ్యక్తి అని కీర్తించడం ప్రారంభించారు. దేశ రాజధాని న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనతో ఏకీభవించారు. రెండు సంవత్సరాల తరువాత వెనుతిరిగి చూస్తే వారి ఆనందోత్సాహాలు తొందరపాటుతో కూడుకున్నవని అనిపిస్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో కేవలం ఒకే ఒక్క రాష్ట్రం-- కేరళ--లో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. ఒకప్పుడు కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్న గుజరాత్, మధ్యప్రదేశ్, హర్యానాలో బీజేపీ స్వతస్సిద్ధ పాలకపక్షంగా భాసిల్లుతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించ లేకపోతున్నారు. 2008లో కాంగ్రెస్ నాయకత్వాన్ని ఆయన లాంఛనంగా చేపట్టినప్పుడు దేశ వ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శాసనసభ్యుల సంఖ్య 1204 నుంచి ఇప్పుడు 676కి పడిపోయింది. రాహుల్‌గాంధీని స్వయంగా కలిసి మాటా మంతీ జరిపాను. ఆయనతో నేను ఉత్తర ప్రత్యుత్తరాలూ సాగించాను. జవహర్‌లాల్ నెహ్రూ మునిమనవడు సద్వర్తనుడు, సందేహం లేదు. ఈ కొద్ది పాటి పరిచయం కూడా లేకపోయినప్పటికీ ఆయన పట్ల నాకు అపార సానుభూతి ఉండేది. ఆయన లోనైన వ్యక్తిగత విషాదాలే ఆ సానుభూతిని కలిగించాయి. యాభై ఐదు సంవత్సరాల వయసులో ఉన్న రాహుల్ తన తల్లి సంకల్పసాధనకు ఒక సాధనంగా మిగిలిపోయాడు. సోనియాగాంధీ ఆదేశం మేరకే ఆయన రాజకీయాలలో ప్రవేశించారనే విషయంలో ఎవరికీ సందేహం లేదు. ఆమె చెప్పిన విధంగానే కాంగ్రెస్‌కు సారథ్యం వహిస్తున్నారు. అయితే మన గణతంత్ర రాజ్యం మౌలిక విలువలు, మనుగడ ప్రమాదంలో పడిన ప్రస్తుత సందర్భంలో ప్రజాచర్చ మారాలి. అది స్పష్టంగా, కఠినంగానే కాకుండా క్రూరంగా కూడా జరగాలి. రాహుల్‌గాంధీ మంచి మనిషి, ఉత్తమ భారతీయుడే. అయితే బీజేపీ విద్వేషపాలనను అంతమొందించేందుకు ఆరాటపడుతున్నవారు తమ ప్రధాన ఆశాజ్యోతిగా రాహుల్‌ను చూడడాన్ని మానుకోవడం మంచిది. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీకి భావి సవాల్‌దారు అయిన రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు కొరవడ్డాయి. ఎన్నికల సంఘం పక్షపాత కార్యసరళి లాంటి సమస్యపై కూడా ఆయన నిర్విరామంగా పోరాడలేదు. 'ఓటు చోరీ'పై ఒకరోజు విలేఖర్ల సమావేశంలో పాల్గొని, మరుసటి రోజే యూరోప్ లేదా లాటిన్ అమెరికాకు వెళ్లిపోవడాన్నే దేశ ప్రజలు చూశారు. తన 22 ఏళ్ల రాజకీయ జీవితంలో భారత్ జోడో యాత్ర చేసిన కొద్ది నెలలు మాత్రమే ప్రజాసమస్యలపై ఆయన తదేక దీక్షతో శ్రద్ధ చూపడం జరిగింది. బీజేపీ నాయకులు అటువంటి దీక్షతో 365 రోజులూ రేయింబవళ్లు పని చేస్తుంటారు. ఈ రోజుల్లో ఆయన తన రాజకీయ కార్యకలాపాలను చాలావరకు సామాజిక మాధ్యమాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఆయన పోస్ట్‌లకు వెన్వెంటనే లైక్‌లు వెల్లువెత్తుతాయి. అయితే ఆయన వ్యాఖ్యలు 24 గంటలలోపే పూర్తిగా విస్మృతమయిపోతున్నాయి! 2004లో లోక్‌సభ సభ్యుడుగా ఎన్నికవక ముందు రాహుల్ ఎక్కడైనా ఏదైనా ఉద్యోగం చేశారా లేదా అన్నది ఎవరికీ తెలియదు. యూపీఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో మంత్రిపదవిని చేపట్టేందుకు ఆయన అంగీకరించలేదు. మరి ఆయన ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు ఎందుకు విశ్వసించాలి? గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని చేతకానితనం రాహుల్‌కు ఉన్నది. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధానమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని రాహుల్ కొనసాగిస్తున్నాడు. సందర్భవశాత్తు చాలా మంది పట్టించుకోని ఒక వాస్తవాన్ని చెప్పవలసి ఉన్నది: అధికారం వంశపారంపర్య హక్కు కాదనే విషయాన్ని ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలు నిరూపించాయి. అసోంలో తరుణ్ గొగోయ్ కుమారుడు కాంగ్రెస్ ప్రచారానికి నాయకత్వం వహించడం బీజేపీ విజయానికి దోహదం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్‌కు అగ్రప్రాధాన్యమివ్వడం ఆమెకే నష్టదాయకమైనది. తమిళనాడులో స్టాలిన్ తన కుమారుడు ఉదయనిధిని అందలాలు ఎక్కించడం విజయ్ విజయానికి విశేషంగా తోడ్పడింది. కేరళలో పినరయి విజయన్ తన అల్లుడిని ప్రమోట్ చేయడం కాంగ్రెస్ విజయానికి సహాయపడింది. ఆయా పార్టీల జయాపజయాలకు ఇంకా చాలా కారణాలు ఉన్నప్పటికీ వంశపారంపర్య రాజకీయాలకు ప్రజల తిరస్కృతి వాటిలో మరింత ముఖ్యమైనది. కాంగ్రెస్ పార్టీ ప్రథమ కుటుంబంపై ఈ విమర్శలు, కేంద్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ఏ విధంగాను సమర్థించడం కానే కాదు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలు, ప్రజా వ్యవస్థలను ఎలా నిస్సారం చేస్తోందో, మీడియాను ఎలా బెదిరిస్తూ వస్తోందో, న్యాయవ్యవస్థను ఎలా లొంగదీసుకున్నదో, ప్రజాస్వామ్య ప్రక్రియలను ఎలా బలహీనపరుస్తోందో, మైనారిటీలను ఎంత నిర్దాక్షిణ్యంగా అణచివేస్తోందో, అనుసరిస్తున్న విదేశీ విధానం ఎంత లోపభూయిష్టమైనదో, వైజ్ఞానిక పరిశోధనలకు వాటిల్లుతోన్న నష్టాన్ని ఆశ్రిత పెట్టుబడిదారులకు ఎలా లబ్ధి చేకూర్చుతున్నదీ, మన అడవులు, నేలలు, జలవనరులను ఎలా ధ్వంసం చేస్తుందో నేను ఎప్పటికప్పుడు సవివరంగా వ్యాఖ్యానిస్తూ వస్తున్నాను. మే 2014 నుంచి మన గణతంత్ర రాజ్యం ఇలా భ్రష్టమవుతుండడానికి ప్రధాన కారకులు నరేంద్ర మోదీ, అమిత్ షా, వారి ఆధ్వర్యంలోని బీజేపీ. ఈ నాయక ద్వయం అధికారాన్ని స్వాధీనం చేసుకుని సుస్థిరం చేసుకోవడంలో ఉద్దేశపూర్వకంగానో, అనుద్దేశపూర్వకంగానో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ వారి విధేయులు ఆ ఉభయులకూ సహాయపడుతున్నారనే వింత వాస్తవం ఇప్పుడు స్పష్టంగా కనపడుతున్నది. మన భారత్ భవిష్యత్తేమిటి? నేనేమీ నిరుత్సాహపడడం లేదు. నిరాశాపూరిత వ్యాఖ్యతో నేను ఈ వ్యాసాన్ని ముగించబోవడం లేదు. నిజమే, మోదీ నాయకత్వంలో బీజేపీ ఇప్పుడు ఒక అజేయ శక్తిగా విలసిల్లుతున్నది. ఆ మాటకొస్తే హంగరీలో విక్టర్ ఓర్బాన్, ఆయన నాయకత్వంలోని ఫిడెజ్ దశాబ్దాల పాటు రాజ్యమేలలేదూ? చివరకు ఏమయింది? ఎవరికీ అంతగా తెలియని పీటర్ మాగ్యార్, ఆయన నాయకత్వంలోని టిస్జా పార్టీ ఓర్బాన్‌ను పదవీచ్యుతుణ్ణి చేశాయి. కొమ్ములు తిరిగిన రాజకీయ నాయకులు, సువ్యవస్థిత ప్రతిపక్షాలు సాధించలేనిదానిని మాగ్యార్ సాధించారు. ఇతర విపక్ష నేతలకు సంస్థాగత సాధనాలు రాజకీయ వేదికలు ఉన్నప్పటికీ మాగ్యార్ దేశవ్యాప్తంగా, ప్రత్యేకించి చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో నిర్విరామంగా పర్యటిస్తూ సామాన్య ప్రజలను సమీకరించి, సమైక్యపరిచి అంతిమ విజయాన్ని సాధించారు. పీటర్ మాగ్యార్ లాగా రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ తామెదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులను ధిక్కరించి కదనశంఖం పూరిస్తారని ఆశించగలమా? 2029 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ దేశంలో రాజకీయ చర్చలు ముస్లిం విద్వేష రాజకీయాల నుంచి ఆర్థిక వాస్తవాల వైపు తప్పక మళ్లుతాయి. ఆ విద్వేష రాజకీయాలు జీవన వ్యయాలను తగ్గించవని, గౌరవప్రదమైన ఉపాధిని కల్పించబోవని, తమ పిల్లలకు మంచి భవిష్యత్‌ను ఇవ్వబోవనే సత్యాన్ని మరింత మంది హిందువులు తప్పక గుర్తిస్తారు. కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం ఇప్పటికే ఆ సత్యాన్ని ఘోషించలేదూ? అధికార పార్టీ అసత్య ప్రచారాలను యువ భారతీయులు ఇంకెంత మాత్రం విశ్వసించడం లేదని 'బొద్దింకల' ఉద్యమం నిరూపించింది. మోదీ సర్కార్ పాలన పట్ల ప్రజల అసంతృప్తి మరింత తీవ్రమయినప్పుడు దానిని ఒక ప్రభావశీల రాజకీయ శక్తిగా పరిణమింపచేసేది ఎవరు? ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు జాతి ఆర్థిక, సామాజిక పునరుజ్జీవానికి నిర్మాణాత్మక కార్యక్రమాలను దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నివేదించగల నాయకుడు లేదా నాయకులు ఎవరు? జవహర్‌లాల్ నెహ్రూ ముని మనవడు లేదా ముని మనవరాలు గానీ లేదా వారిరువురు గానీ అటువంటి ఉత్తేజకర రాజకీయ చైతన్యాన్ని పురిగొల్పడం అసంభవంగా కనిపిస్తోంది. ఎన్నికల రాజకీయాలలో వారి గత రికార్డే ఈ అభిప్రాయానికి తావిచ్చింది.

# కార్మికుల మనసు గెలిచిన మంత్రి

-కార్మికుల ఆశాకిరణం గడ్డం వివేక్ వెంకటస్వామి..
-వేతన విప్లవంతో కోటి మందికి ఊరట..
-కార్మిక హక్కుల కాపలాదారు వివేక్ వెంకటస్వామి..
-సంక్షేమం--ఉపాధి--భద్రతకు పెద్దపీట..

హంసకలం వార్త మే 30 మంచిర్యాల జిల్లా ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్ వెంకటస్వామి కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ఉపాధి అవకాశాల విస్తరణ కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటూ కార్మిక పక్షపాతిగా గుర్తింపు పొందుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతూ కార్మిక వర్గంలో విశ్వాసాన్ని పెంచుతున్నారు. కార్మికుల కనీస వేతనాల సవరణ విషయంలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న గడ్డం వివేక్ 34.95 శాతం వేతన పెంపును అమలు చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కోటి 11 లక్షల మంది కార్మికులకు భారీ ఆర్థిక ఊరట కల్పించారు. దాదాపు పదేళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న వేతన సవరణ అంశానికి ముగింపు పలికి కార్మికుల జీవితాల్లో కొత్త ఆశలు నింపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 120 నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచే దిశగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. కార్మికుల సామాజిక భద్రతను బలోపేతం చేయడంతో పాటు పరిశ్రమల్లో పని పరిస్థితుల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. కార్మికుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ విషయంలో రాజీపడకుండా ముందుకు సాగుతున్న గడ్డం వివేక్ వెంకటస్వామి తీసుకుంటున్న నిర్ణయాలు కార్మిక వర్గానికి మరింత భరోసాను కల్పిస్తున్నాయి. కార్మిక సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమనే భావనతో పనిచేస్తున్న గడ్డం వివేక్ కార్మికుల సమస్యల పరిష్కారంలో చూపుతున్న చొరవతో రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆయన




చూపుతున్న అంకితభావం తెలంగాణ కార్మిక రంగ అభివృద్ధికి కొత్త దిశను చూపుతోందని కార్మిక సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే ప్రభుత్వ లక్ష్యం

-శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
-అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది
-అధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశం

ధర్మఘంట మే30 నాగర్ కర్నూల్ :

అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జూన్ నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల స్థితిగతులను శాఖల వారీగా సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులు, డ్రైనేజీ నిర్మాణాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం, తాగునీటి సౌకర్యాల కల్పన, విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి తదితర కార్యక్రమాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ఈ నేపథ్యంలో గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ పనులన్నీ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా పర్యవేక్షించాలని, నాసిరకం పనులకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వవద్దని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, ఆ దిశగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయం లోపించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను



ఆదేశించారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, గడువులోపు పూర్తి కాని పనులపై సంబంధిత అధికారుల బాధ్యతను నిర్ధారిస్తామని, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొండారెడ్డిపల్లిని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శ వంతమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, కేవీ నరసింహారెడ్డి, అదనపు కలెక్టర్ దేవ సహాయం, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి రాజేశ్వరి ,వివిధ జిల్లా , నియోజకవర్గం,మండల స్థాయి శాఖల అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

# హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
-వాస్తవ సమాచారాన్నే ఎన్యూమరేటర్లకు అందించాలి
-సర్వేలో ఇచ్చే సమాచారంతో సంక్షేమ పథకాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు
-క్యాంపు కార్యాలయంలో హౌస్ లిస్టింగ్ సర్వేలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

హంసకలం వార్త మే 30

జనాభా గణన-2027లో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించి ఎన్యూమరేటర్లకు వాస్తవ సమాచారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హౌస్ లిస్టింగ్ సర్వేలో పాల్గొని ఎన్యూమరేటర్‌కు అవసరమైన వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్వే ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ హౌస్ లిస్టింగ్ సర్వే జనాభా గణన-2027లో అత్యంత కీలకమైన దశ అని తెలిపారు. ప్రతి ఇంటి నిర్మాణం, గృహ సౌకర్యాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య సదుపాయాలు, విద్యుత్, వంట ఇంధనం, కమ్యూనికేషన్ సౌకర్యాలు తదితర వివ రాలను ఈ సర్వే ద్వారా నమోదు చేస్తారని చెప్పారు. సర్వే ద్వారా సేకరించే సమాచారం ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యులు పూర్తి స్థాయిలో సహకరించి సరైన వివరాలను అందించాలని కలెక్టర్ సూచించారు. సర్వేలో అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ఈ సమాచారంతో ఏ సంక్షేమ పథకం రద్దు కావడం గానీ, లబ్ధిదారుల



అర్హతలు ప్రభావితమవడం గానీ జరగదని స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి అపోహలకు తావివ్వకుండా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు, పర్యవేక్షకులు నిబం ధనల ప్రకారం ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను నమోదు చేయాలని, సర్వేను పారదర్శకంగా, నాణ్యతతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గోన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్

హంసకలం వార్త మే 30

జూన్ రెండవ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజ గౌడ్ ఆదే శించారు. జూన్ 2న నిర్వ హించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లు, నిర్వహణపై కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జిల్లా స్థాయి అధికారులతో అదనపు కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్న వేడు కలకు సీటింగ్ ఏర్పాట్లు, ఇతర అన్ని కార్య క్రమాలు ప్రోటోకాల్‌కు అనుగుణంగా పక్కాగా నిర్వహించాలని వేడుకలకు హాజరయ్యే ప్రజా ప్రతినిధులు, విద్యార్థులకు, అధికారులు ప్రజలందరికీ తగిన వసతులు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వ హించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రతిబింబిం చేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదా యాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మండలాలు, గ్రామ స్థాయిలో కూడా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, కలెక్టరేట్ ఏ.వో కిషన్ , డిపివో



మదన్ మోహన్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్ కుమార్, జిల్లా వైద్య శాఖ అధికారిణి సుజాత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిషోర్, ఈఈపిఆర్ లక్ష్మణ్ రావు, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాస్, మెప్మా ఏ . ఓ శ్రీనివాస్, ఎస్.కే.ఎన్.ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ అశోక్, సమగ్ర శిక్ష ప్లానింగ్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మై థింగ్ ఈస్ నథింగ్...సమ్ థింగ్ ఈస్ ఇంట్రెస్టింగ్

(మనిషి స్వభావంలోని విచిత్ర కోణం)

హంసకలం వార్త మే 30



మనిషి ఎంత తెలివైన జీవి అయినా...అతని ఆలోచనా విధానంలో కొన్ని విచిత్రమైన మలుపులు ఉంటాయి.తనలో ఎన్ని లోపాలు ఉన్నా,తన కుటుం బంలో ఎన్ని సమస్యలు ఉన్నా వాటిని సాధారణంగా తీసుకుంటాడు.కానీ, పక్కింటివాడి చిన్న తప్పు కూడా అతనికి పెద్ద వార్తగా కనిపిస్తుంది. తన ఇంట్లో చెలరేగుతున్న కలహాల కన్నా,పొరుగింటి గొడవలే ఎక్కువ ఆసక్తిని కలిగిస్తాయి.ఇదే మనిషి సహజ స్వభావంలోని ఒక ఆసక్తికరమైన కోణం.నా విషయం ఏమీలేదు.కానీ, వాడి విషయం చాలా ఇంట్రెస్టింగ్ అనే భావజాలం చాలా మందిలో కనిపిస్తుంది.ఇది కేవలం సరదా వ్యాఖ్య కాదు. మానవ మనస్తత్వానికి అద్దం పట్టే నిజం.తన బలహీనతలను మనిషి సాధారణంగా సమర్థించుకుంటాడు. “పరిస్థితులు అలా వచ్చాయి,అది పెద్ద విషయం కాదు,అందరూ అలాగే చేస్తారు” అంటూ తన తప్పులను తేలికగా తీసుకుంటాడు.కానీ,అదే పని 6ఇతరులు చేస్తే మాత్రం న్యాయమూర్తిలా తీర్పు చెబుతాడు.ఎందుకంటే తనను తాను విమర్శించుకోవడం కంటే, ఇతరులను విశ్లేషించడం మనిషికి సులభం.ఇది కేవలం వ్యక్తిగత స్థాయిలోనే కాదు.సమాజం మొత్తంలో కనిపించే మానసిక ధోరణి.ఒక కుటుంబంలో సమస్యలు ఉన్నప్పుడు వాటిని దాచిపెట్టడానికి ప్రయత్నిస్తారు.కానీ,పక్కింట్లో ఏదైనా జరిగితే మాత్రం అది చర్చకు వస్తుంది. కొందరికి ఇతరుల జీవితం ఒక వినోదంగా మారిపోతుంది.వారి కష్టాలు,వారి లోపాలు,వారి అపజయాలు ఇవన్నీ ఆసక్తికరమైన అంశాలుగా మారిపోతాయి.సోషల్ మీడియా కాలంలో ఈ స్వభావం మరింత పెరిగింది.ఎవరి వ్యక్తిగత జీవితం అయినా ఇప్పుడు పబ్లిక్ చర్చగా మారుతోంది.ఒకరి పొరపాటు వైరల్ అవుతుంది.ఒకరి కుటుంబ సమస్య ట్రెండ్ అవుతుంది. కానీ ,అదే సమయంలో మనలోని లోపాలను చూసుకునే ప్రయత్నం మాత్రం తగ్గిపోతోంది. మనం ఇతరుల జీవితాలను విశ్లేషించడంలో గడిపే సమయాన్ని, మన జీవితాన్ని సరిచేసుకోవడంలో వెచ్చిస్తే చాలా మార్పు వస్తుంది. ఇతరుల తప్పులు కనిపించడం తప్పు కాదు.కానీ,వాటిని హైలెట్ చేస్తూ,ప్రచారం చేస్తూ, ఆనందించడం మాత్రం మానవత్వం కాదు.ఎందుకంటే ప్రతి మనిషి జీవితంలో కనిపించని పోరాటాలు ఉంటాయి.బయటికి నవ్వుతూ కనిపించే వ్యక్తి లోపల ఎన్నో బాధలు మోస్తూ ఉండొచ్చు. వాస్తవానికి పరిపక్వత అంటే ఇతరుల లోపాలను వెతకడం కాదు.తనలోని లోపాలను గుర్తించడం.ఇతరుల జీవితాలను విమర్శించడం కాదు.తన జీవితాన్ని మెరుగుపరుచుకోవడం.మనిషి ఎదుగుదల అక్కడి నుంచే ప్రారంభమవుతుంది.“పక్కోడిలో తప్పు కనిపించే కళ్లే...ఒకసారి మనలోకి కూడా చూడాలి” అనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలి. ఎందుకంటే మనిషి గొప్పతనం ఇతరులను చిన్నచూపు చూడటంలో కాదు.తనను తాను సరిచేసుకోవడంలో ఉంటుంది.



## మై థింగ్ ఈస్ నథింగ్...సమ్ థింగ్ ఈస్ ఇంట్రెస్టింగ్

(మనిషి స్వభావంలోని విచిత్ర కోణం)

హంసకలం వార్త మే 30

మనిషి ఎంత తెలివైన జీవి అయినా...అతని ఆలోచనా విధానంలో కొన్ని విచిత్రమైన మలుపులు ఉంటాయి.తనలో ఎన్ని లోపాలు ఉన్నా,తన కుటుంబంలో ఎన్ని సమస్యలు ఉన్నా వాటిని సాధారణంగా తీసుకుంటాడు. కానీ, పక్కింటి వాడి చిన్న తప్పు కూడా అతనికి పెద్ద వార్తగా కనిపిస్తుంది. తన ఇంట్లో చెలరేగు తున్న కలహాల కన్నా, పొరుగింటి గొడవలే ఎక్కువ ఆసక్తిని కలిగిస్తాయి.ఇదే మనిషి సహజ స్వభావంలోని ఒక ఆసక్తికరమైన కోణం.నా విషయం ఏమీలేదు.కానీ,వాడి విషయం చాలా ఇంట్రెస్టింగ్ అనే భావజాలం చాలా మందిలో కనిపిస్తుంది.ఇది కేవలం సరదా వ్యాఖ్య కాదు. మానవ మనస్తత్వానికి అద్దం పట్టే నిజం.తన బలహీనతలను మనిషి సాధారణంగా సమర్థించుకుంటాడు. “పరిస్థితులు అలా వచ్చాయి,అది పెద్ద విషయం కాదు,అందరూ అలాగే చేస్తారు” అంటూ తన తప్పులను తేలికగా తీసుకుంటాడు.కానీ,అదే పని 6ఇతరులు చేస్తే మాత్రం న్యాయ మూర్తిలా తీర్పు చెబుతాడు.ఎందుకంటే తనను తాను విమర్శించుకోవడం కంటే, ఇతరులను విశ్లేషించడం మనిషికి సులభం.ఇది కేవలం వ్యక్తిగత స్థాయిలోనే కాదు.సమాజం మొత్తంలో కనిపించే మానసిక ధోరణి.ఒక కుటుంబంలో సమస్యలు ఉన్నప్పుడు వాటిని దాచిపెట్టడానికి ప్రయత్నిస్తారు. కానీ, పక్కింట్లో ఏదైనా జరిగితే మాత్రం అది చర్చకు వస్తుంది. కొందరికి ఇతరుల జీవితం ఒక వినోదంగా మారిపోతుంది.వారి కష్టాలు,వారి లోపాలు, వారి అపజయాలు ఇవన్నీ ఆసక్తికరమైన అంశాలుగా మారిపోతాయి. సోషల్ మీడియా కాలంలో ఈ స్వభావం మరింత పెరిగింది.ఎవరి వ్యక్తిగత జీవితం అయినా ఇప్పుడు పబ్లిక్ చర్చగా మారుతోంది.ఒకరి పొరపాటు వైరల్ అవుతుంది.ఒకరి కుటుంబ సమస్య ట్రెండ్ అవుతుంది.కానీ,అదే సమయంలో మనలోని లోపాలను చూసుకునే ప్రయత్నం మాత్రం తగ్గిపోతోంది. మనం ఇతరుల జీవితాలను విశ్లేషించడంలో గడిపే సమయాన్ని, మన జీవితాన్ని సరిచేసుకోవడంలో వెచ్చిస్తే చాలా మార్పు వస్తుంది. ఇతరుల తప్పులు కనిపించడం తప్పు కాదు.కానీ,వాటిని హైలెట్ చేస్తూ,ప్రచారం చేస్తూ, ఆనందించడం మాత్రం మానవత్వం కాదు.ఎందుకంటే ప్రతి మనిషి జీవితంలో కనిపించని పోరాటాలు ఉంటాయి.బయటికి నవ్వుతూ కనిపించే వ్యక్తి లోపల ఎన్నో బాధలు మోస్తూ ఉండొచ్చు. వాస్తవానికి పరిపక్వత అంటే ఇతరుల లోపాలను వెతకడం కాదు.తనలోని లోపాలను గుర్తించడం.ఇతరుల జీవితాలను విమర్శించడం కాదు.తన జీవితాన్ని మెరుగుపరుచుకోవడం.మనిషి ఎదుగుదల అక్కడి నుంచే ప్రారంభమవుతుంది.“పక్కోడిలో తప్పు కనిపించే కళ్లే...ఒకసారి మనలోకి కూడా చూడాలి” అనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలి. ఎందుకంటే మనిషి గొప్పతనం ఇతరులను చిన్నచూపు చూడటంలో కాదు.తనను తాను సరిచేసుకోవడంలో ఉంటుంది.

హంస కలం వార్త HAMSA KALAM VARTA



## హామీల మాటున రేవంత్ రాజకీయం.సెల్ఫ్ గోల్ అవుతుందా

-గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో సెటిలర్ల ఓట్ల కోసం ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ?

-సీఎం రాజకీయ పాలన నిర్ణయాలు బూమ్ రాంగ్ అవుతున్నాయన్న గుసగుసలు?

-వరుసగా దివంగత రోశయ్య బాలసుబ్రమణ్యం,ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ?

-జూబ్లీహిల్స్ఎన్నిక సందర్భం గా కాంగ్రెస్ హామీల అమలు లో భాగంగానే ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ?



హంసకలం వార్త మే 30

సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ పాలన నిర్ణయాలు బూమ్ రాంగ్ అవుతున్నాయన్న గుసగుసలు పొలిటికల్ సర్కిల్ లో క్రమంగా బలపడు తున్నాయి. ఇందుకు తాజాగా హైదరాబాద్ మైత్రీవనం వద్ద మహానటుడు, దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహా విష్కరణను రేవంత్ రెడ్డి స్వయంగా నిర్వహించడం ఓ ఉదాహరణ గా చెబుతున్నారు. వరుసగా దివంగత రోశయ్య బాలసుబ్రమణ్యం,ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ రేవంత్ రెడ్డి పాలనలో వరుసగా దివంగత మాజీ సీఎం రోశయ్య, గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ జరుగడాన్ని తెలంగాణ వాదులు గట్టిగానే ప్రశ్నిస్తున్నారు. ఇదే సమయంలో ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు వ్యాఖ్యలపై ఆంధ్ర నాయకత్వం వైఖరి కూడా తెలంగాణ వాదులలో ఆగ్రహాన్ని రగిలించింది. తాజా పరిణామాలన్నింటిని కలిపి విశ్లేషిస్తూ రేవంత్ పాలనలో తెలంగాణ ప్రాంతంలో మళ్లీ సమైక్య వాదుల, ఆంధ్రా పాలకుల ఆధిపత్య ధోరణులు పెచ్చరిల్లుతున్నాయన్న వాదన తెరపైకి వచ్చింది. ఇది ఓ విధంగా అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఇరకాటంగా మారుతుంది. తెలుగువారందరికి ఎన్టీఆర్ పట్ల అభిమానం ఉన్నప్పటికి రాష్ట్ర విభజన తర్వాత కూడా కొత్తగా ఆంధ్రా ప్రాంత ప్రముఖుల విగ్రహాల ఏర్పాటు ఎందుకన్న ప్రశ్నను తెలంగాణ వాదులు సంధిస్తున్నారు. ఆంధ్రా ప్రాంతంలో గద్దర్ వంటి తెలంగాణ ప్రముఖుల విగ్రహాలు పెట్టనివ్వనప్పుడు ఇక్కడా వాళ్ల విగ్రహాలు ఎందుకు అన్న ప్రశ్న లేవనెత్తుతున్నారు. తెలంగాణ వాదుల అగ్రహాన్ని ఇదే అదనుగా బీఆర్ఎస్ రాజకీయంగా అడ్వాంటేజీగా మార్చుకునే ప్రయత్నం చేయడం కాంగ్రెస్ కు మరింత సంకటంగా చెప్పవచ్చు. జూబ్లీహిల్స్ఎన్నిక సందర్భం గా కాంగ్రెస్ హామీల అమలు లో భాగంగానే ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ హామీల అమలులో భాగంగానే తను ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసినట్లుగా రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అలాగైతే అదే ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి ఇంకా అనేక హామీలు ఇచ్చారు. సినీ కార్మికులకు ఇచ్చిన హామీలతో పాటు, కాలనీల వారిగా స్థానిక సమస్యలపై సైతం హామీలు గుప్పించారు 2023అసెంబ్లీ సాధారణ ఎన్నికలలో డిక్లరేషన్లు,ఆరు గ్యారంటీలు 420హామీలు, 2024 పార్లమెంటు ఎన్నికల్లోనూ భారీ సంఖ్యలో హామీలు గుప్పించారు. ఆయా ఎన్నికల హామీలకు లేని తొందర అతృత ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు, అదికూడా ప్రభుత్వ డబ్బుతో ఎందుకన్న ప్రశ్న సహజంగానే వినిపిస్తుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సాకుతో ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలకే దిక్కులేక వచ్చే ఎన్నికల్లో గత హామీలే పార్టీ మెడకు గుది బండలుగా మారే పరిస్థితి కనిపిస్తున్న వేళ అకస్మికంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణపై సీఎం రేవంత్ ఎందుకింత హడావుడి చేశారన్నది సొంత కాంగ్రెస్ శ్రేణులలో సైతం అయోమయం రేపింది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో సెటిలర్ల ఓట్ల కోసం ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో సెటిలర్ల ఓట్ల కోసం ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి నెత్తినేసుకున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే రేవంత్ చర్యతో పార్టీకి లాభం ఎంతన్నదానిపై పార్టీ వర్గాలలో జోరుగా అంతర్మథనం సాగుతుంది. ఓ వైపు ధాన్యం కొనుగోలు, రైతు భరోసా సమస్యలతో రైతులు, మరోవైపు జాబ్ క్యాలెండర్ అమలు కాక నిరుద్యోగులు, డిమాండ్లపై సానుకూల స్పందన లేక ఉద్యోగులు అసంతృప్తితో రగిలిపోతున్న తరుణంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ రచ్చ ఎందుకన్న వాదన సైతం వినిపిస్తుంది. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో 2009ఎన్నికల్లో బీఆర్ఎస్, టీడీపీ కూటమిని తెలంగాణ ప్రజలు తిరస్కరించారు. ఆ తర్వాత 2018ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ కూటమిని సైతం తెలంగాణ ప్రజలు తిరస్కరించారు. ప్రజాతీర్పు సమైక్యవాదానికి వ్యతిరేకంగా స్పష్టంగా ఉన్నప్పటికి కూడా మళ్లీ రేవంత్ రెడ్డి తెలంగాణలో ఆంధ్ర నాయకత్వానికి ఎందుకు ప్రాధాన్యతనిస్తున్నారని?రేవంత్ తీరు కాంగ్రెస్ కు రాజకీయంగా నష్టాన్ని కల్లించవచ్చన్న చర్చ సాగుతుంది. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేయడాన్ని నిరసిస్తున్న తెలంగాణ వాదులు సీఎం రేవంత్ రెడ్డి తాజాగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేయడాన్ని నిరసిస్తున్న తెలంగాణ వాదులు శనివారం ఉదయం తెలంగాణ కవి, గాయకుడు అందెశ్రీ సమాధి దుస్థితిపై వీడియో విడుదల చేయడం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పక్క రాష్ట్రం ప్రముఖుల విగ్రహాల మీద ఉన్న శ్రద్ధ తెలంగాణ ప్రముఖులు విగ్రహాలు, సమాధులపై ఎందుకు లేదంటూ రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుడైన అందెశ్రీ గతంలో రేవంత్ రెడ్డి సీఎం అవడానికి చాలా కష్టపడ్డారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు అందెశ్రీ స్మృతి వనం అభివృద్ధిని రేవంత్ విస్మరించినట్లుగా ఉందని, అక్కడ కనీసం ఆయన సమాధి కూడా సరిగా కట్టలేదంటూ రేవంత్ తీరుపై విమర్శలు సంధిస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుడు, దళితుడు, జయ జయహే తెలంగాణ గేయ రచయిత అందెశ్రీని ఎన్నికల సమయంలో వాడుకొని, ఆయన పాటను రాజకీయ అవసరాల కోసం వాడుకొని ఈరోజు ఆయన సమాధిని అనాధలా వదిలేశాడంటూ రేవంత్ రెడ్డిపై తెలంగాణ వాదులు విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ వైతాళికుడు సూరవరం ప్రతాప్‌రెడ్డి విగ్రహానికి పిలిచినప్పటికి ఎందుకు జూబ్లీహిల్స్ లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు హాజరైన సీఎం అదే రోజు జరిగిన తెలంగాణ వైతాళికుడు సూరవరం ప్రతాప్‌రెడ్డి విగ్రహానికి పిలిచినప్పటికి ఎందుకు వెళ్లలేదంటూ పలువురు తెలంగాణ వాదులు నిలదీస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెటిలర్ల ఓట్ల మీద ఉన్న ధ్యాస తెలంగాణవైతాళికుడి మీద లేదా సెటిలర్ల ఓట్ల మీద ఉన్న ధ్యాస తెలంగాణ వైతాళికుడి మీద లేదా అంటూ మండిపడుతున్నారు. న్టీఆర్ విగ్రహం పెట్టింది ఆయన మీద ప్రేమతోనా? ఓట్ల కోసమా అంటూ నిలదీస్తున్నారు. మొత్తంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసి సీఎం రేవంత్ రెడ్డి రాజకీయంగా సెల్ఫ్ గోల్ చేసుకున్నారన్న చర్చ బలంగా వినిపిస్తుండటం విశేషం

## అమ్మ మాట అంగన్‌వాడీ బాట'ను విజయవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ రాజర్షి షా

హంసకలం వార్త మే 30

గర్భిణీ స్త్రీలు, బాలింతలు,చిన్నారుల సమగ్ర ఆరోగ్యం,పోషణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన "అమ్మ మాట-అంగన్‌వాడీ బాట"కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రిక్షా కాలనీ నందు మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన"అమ్మ మాట-అంగన్‌వాడీ బాట"కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభించే విభిన్న సేవలను గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాలు మన పిల్లల ప్రగతికి పునాది అని, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు,తల్లుల సంరక్షణకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు."అమ్మ మాట- అంగన్‌వాడీ బాట" పథకం ద్వారా లబ్ధిదారులకు అందుతున్న సేవల ప్రాధాన్యతను వివరించారు.గర్భిణీ స్త్రీలకు గర్భధారణ సమయం నుండి తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన సంపూర్ణ పౌష్టికాహారాన్ని, బలాన్నిచ్చే ఆహార పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లోపం లేకుండా అందించాలని పేర్కొన్నారు.అలాగే, ప్రసవానంతరం తల్లులు త్వరగా కోలుకోవడానికి, శిశువుకు అవసరమైన తల్లిపాలు సక్రమంగా అందేలా బాలింతలకు అవసరమైన ప్రత్యేక ఆరోగ్య సేవలను, పోషకాహారాన్ని సమకూర్చడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మరోవైపు,6 నెలల వయస్సు నుండి 6 సంవత్సరాల లోపు ఉన్న చిన్న పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడేలా రుచికరమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతిరోజూ నిబంధనల ప్రకారం పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులలో విద్యా పునాది బలంగా ఉండాలని,అందుకు అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన నాణ్యమైన ప్రీ-స్కూల్ (పూర్వ ప్రాథమిక) విద్యను పక్కాగా అమలు చేయాలన్నారు. వీటితో పాటు, చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షించడానికి సకాలంలో వేయాల్సిన అన్ని రకాల టీకాలను (ఇమ్మ్యునైజేషన్), క్రమబద్ధమైన ఆరోగ్య పరీక్షలను వైద్య శాఖ సమన్వయంతో ఉచితంగా నిర్వహించాలని సూచించారు. బాలల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు ఒక



బలమైన పునాదిగా పనిచేస్తూ,ఆరోగ్యకరమైన బాల్యానికి బాటలు వేయాలని ఆకాంక్షించారు. 'తెలంగాణ రైజింగ్' సంకల్పంలో భాగంగా సాగుతున్న ఈ సేవలలో ఏవైనా లోపాలున్నా, లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా ప్రభుత్వ ఉచిత చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్: 1098 ను (24 గంటలు) సంప్రదించవచ్చని తెలియజేశారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు కలెక్టర్ చేతుల మీదుగా ఆంగవాడి యూనిఫారం లను,'విద్యా ఆరంభ సర్టిఫికెట్లను'అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, వార్డ్ కౌన్సిలర్ స్వాతి మంగేష్ దేవతలే, స్థానిక అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు,పోషకులు, చిన్నారులు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

-మహిళా వారోత్సవాలలో భాగంగా కలెక్టరేట్ లో మాక్ పార్లమెంట్ నిర్వహణ

హంసకలం వార్త మే 30

విద్యార్ధి దశ నుండే బాలికలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి సూచించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శనివారం కిశోర బాలికలతో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బాలికలు స్పీకర్, డిప్యూటి స్పీకర్, ముఖ్యమంత్రి, మంత్రులు, శాసన సభ్యులు, ప్రతిపక్ష సభ్యుల పాత్రలను పోషిస్తూ సభా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా చట్ట సభలలో జరిగే సమావేశాల తీరును కళ్ళకు కట్టినట్లు ఆవిష్కరింపజేశారు. మహిళా సాధికారత, బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి అవకాశాలు, సమాజ అభివృద్ధి తదితర అంశాలపై ఎమ్మెల్యేలుగా వ్యవహరించిన వారు ప్రశ్నలను లేవనెత్తగా, సంబంధిత శాఖల మంత్రుల పాత్రను పోషించిన బాలికలు సమాధానాలు తెలుపుతూ మహిళలు, బాలికల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. దాదాపు రెండు గంటలకు పైగా మాక్ పార్లమెంట్ సెషన్ అద్యంతం ఎంతో ఆసక్తిగా కొనసాగింది. చట్ట సభలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధుల పాత్రలో బాలికలు ఎంతో చక్కగా ఇమిడిపోయి రాణించడం పట్ల కలెక్టర్ వారిని అభినందిస్తూ తన తరఫున పలువురికి ప్రత్యేక బహుమతులు అందించి




ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడం, సముచిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, తాము ఆశించిన దానికంటే ఎంతో ఉత్తమంగా బాలికలు రాణించి మాక్ పార్లమెంట్ ను విజయవంతం చేశారని ప్రశంసించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిణతిని ప్రదర్శిస్తూ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించుకోవాలని హితవు పలికారు. హిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో వినియోగించుకోవాలని, స్మార్ట్ ఫోన్లలో అనవసర విషయాలకు సమయం వృధా చేయకూడదని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యాల పరిరక్షణ కోసం తప్పనిసరిగా పౌష్టిక ఆహారం తీసుకోవాలని అన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే నిస్సంకోచంగా అధికారుల దృష్టికి తేవాలని, భద్రతా పరమైన సమస్యలు ఎదురైనప్పుడు భరోసా కేంద్రాన్ని సంప్రదించవచ్చని సూచించారు. కాగా, తల్లిదండ్రులు పిల్లలను సమ దృష్టితో పెంచాలని, బాలికల పట్ల వివక్షను ప్రదర్శించకూడదని, వారు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహించాలని హితవు పలికారు. బాలికల విద్యకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కేరళంలో అక్షరాస్యత 90 శాతానికి పైగా ఉందని, అదే స్ఫూర్తితో తెలంగాణాలో కూడా అక్షరాస్యతను గణనీయంగా వృద్ధి చెందేలా ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తాము గమనించిన పలు సమస్యలు, ఇబ్బందుల గురించి బాలికలు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తరపున తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.ఈ.ఓ అశోక్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, జిలా సంక్షేమ అధికారిణి పద్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన నలుగురు పోలీసు అధికారులను ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

హంసకలం వార్త మే 30

పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి పదవీ విరమణ పొందిన ఎస్ఐ, ఏఎస్ఐ, ఏఆర్ ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ లను ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఘనంగా సత్కరించారు.42 సంవత్సరాలు పోలీసు శాఖలో తమ సేవలను అందించి పదవీ విరమణ పొందిన ఎస్సై కసిబోయిన సత్యనారాయణ రాజు,37 సంవత్సరాలు పోలీసు శాఖలో తమ సేవలను అందించి పదవీ విరమణ పొందిన ఏఎస్సై జంపాల హనుమంతరావు, 41 సంవత్సరాలు పోలీసు శాఖలో తమ సేవలను అందించి ప్రస్తుతం పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఏఆర్ ఎస్ఐ ధారావత్ వెంకటేశ్వర్లు , 36 సంవత్సరాలు పోలీసు శాఖలో తమ సేవలను అందించి ప్రస్తుతం అశ్వాపురం నందు విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ ఎట్టా శ్రీనివాసరావు లు శనివారం నాడు పదవీ విరమణ పొందడం జరిగింది. పదవీ విరమణ పొందిన ఈ నలుగురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శాలువాలతో మరియు పూలమాలతో ఘనంగా సత్కరించి ప్రశంస పత్రాలను అందజేయడం జరిగింది. పోలీస్ శాఖలో వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు, వారి కుటుంబ సభ్యులు కూడా వారి యొక్క అనుభవాలను పంచుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎంతో కాలంగా పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. పోలీసు శాఖ నుండి పదవీ విరమణ పొందిన అధికారులు మరియు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.తమ దైనందిన కార్యక్రమాలలో వ్యాయామం,



యోగా,ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం వారికి ప్రభుత్వం నుంచి అందవలసిన ప్రతిఫలాలు త్వరితగతిన అందేలా చూడాలని కార్యాలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్యు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, ఎంటిఓ సుధాకర్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణ మరియు జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారంలోకి రాగానే 111 జీవో ఎత్తివేస్తాం

-గుంపు మేస్త్రీ పై పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలి

-టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

హంసకలం వార్త మే 30

తమ పార్టీ అధికారంలోకి రాగానే 111 జీవో ఎత్తివేస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చెప్పారు. ఈ జీవో కారణంగా బాధపడుతున్న వారందరికీ ఉపశమనం కలిగిస్తామన్నారు. టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మొయినాబాద్ లో ఏర్పాటు చేసిన జెండా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మొయినాబాద్ లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళు లర్పించిన...అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ లక్ష్యాల కోసం తెలంగాణ సాధించుకున్నామో ఆ లక్ష్యాలను గత 12 ఏళ్లలో సాధించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను పరిరక్షించుకునేందుకే టీఆర్ఎస్ ఏర్పాటు చేశామన్నారు.

-111 జీవో ఎత్తివేస్తాం

111 జీవో పరిధిలోని బాధితులందరికీ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత గుడ్ న్యూస్ చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే ఈ జీవో ను ఎత్తివేస్తామన్నారు. ఇతర పార్టీల మాదిరిగా తాము మోసం చేయమని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ లు ఇక్కడి ప్రజలకు 111 జీవో ఎత్తేస్తామంటూ మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశాయని విమర్శించారు. 111 జీవో పరిధిలో ఉన్న 120 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. చుట్టు పక్కల భూములు ఎకరాకు వంద కోట్లకు పైగా ధర పలుకుతుంటే 111 జీవో పరిధిలోని ప్రజలు మాత్రం తమ భూములను ఎక్కువ రేటుకు అమ్ముకోలేని పరిస్థితి ఉందన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం భూమి అమ్మితే సమస్యలు తీరుతాయని భావించినప్పటికీ ఈ జీవో



అడ్డంకిగా ఉందన్నారు. గుంపు మేస్త్రీ తనకు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కటే తెలుసని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ వ్యాపారాన్ని ఊడగొట్టారని మండిపడ్డారు. చేవెళ్ల, మొయినాబాద్ లో ఎక్కువగా రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉంటారని వారికి మేలు చేసేలా ఈ ప్రభుత్వం ఏమీ చేయటం లేదని మండిపడ్డారు. అందుకే గుంపుమేస్త్రీ పై పోరాటానికి ఈ ప్రాంత ప్రజలంతా ముందుకు రావాలని కోరారు.

-హక్కుల పరిరక్షణకే కొత్త పార్టీ

తెలంగాణ వచ్చాక అన్ని సమస్యలు తీరుతాయని భావిస్తే అలా జరగలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఏ లక్ష్యాల కోసం రాష్ట్రం సాధించుకున్నామో ఆ లక్ష్యాలతో పాటు తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసమే తాము కొత్త రాజకీయ శక్తిగా పుట్టుకొచ్చామన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆడబిడ్డల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆడబిడ్డగా, మీ సోదరిగా మీకు ఏం కావాలో నాకు తెలుసు. తప్పకుండా మన పార్టీ ద్వారా మహిళలకు మంచి జరుగుతుందని హామీ ఇస్తున్నా అన్నారు. అదే విధంగా యువత కోసం ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. సృజనాత్మక ఆలోచన కలిగిన యువత వ్యాపారం చేసేలా ప్రోత్సహించేందుకు వారికి ఎలాంటి గ్యారంటీ లేకుండా 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. చేవెళ్ల, మొయినాబాద్ నుంచి మైనార్టీలు పెద్ద ఎత్తున చేరటంతో ఈ ప్రాంతంలో పార్టీ మరింత బలపడిందని చెప్పారు. ఇక్కడి గంగా జమున తెహజీబ్ ను చెడగొట్టే ప్రయత్నం చేస్తున్న వాళ్లకు బుద్ధి చెప్పాల్సిన అవసరముందని కవిత అన్నారు.

-చిలుకూరు బాలాజీ స్వామి వారి దర్శనం

అంతకుముందు కవిత చిలుకూరు బాలాజీ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజాలు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన తమ పార్టీకి స్వామి వారి ఆశీస్సుల కోసం వచ్చామని చెప్పారు. బాలాజీ ఆశీస్సులతో తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రైతులకు మంచి చేసే బుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవ్వాలని స్వామి వారిని కోరుకున్నానని కవిత చెప్పారు. జెండా పండుగ కార్యక్రమం అనంతరం మొయినాబాద్ మండలం సొరంగల్ లో టీఆర్ఎస్ నాయకుడు సంతోష్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బస్ షెల్టర్ కు శంకుస్థాపన చేశారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

హంసకలం వార్త మే 30

జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వేదికను పూలతో ఆకర్షణీయంగా అలంకరించాలని, వేడుకల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర అవతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఆహ్వానించాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే అతిథుల కోసం తగిన సీటింగ్, తాగునీటి సౌకర్యం, సౌండ్ సిస్టమ్, షామియానా తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని, పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఉదయం నిర్ణీత సమయానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం



చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్,జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, హార్టికల్చర్ అధికారి రమణ,ఈతర శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర కమిటీ తరపున ఘనంగా జన్మదిన సంబరాలు జరిగాయి





-రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు.

-వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి లక్ష్మీనరసింహారావు

హంసకలం వార్త మే 30

రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మది నోత్సవాలను ఘనంగా జరిగాయి.తెలంగాణ రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి జన్మది నోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్.కె.పురం స్థానికంగా పలు సేవా కార్య క్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రసిద్ధ శ్రీ శ్రీ శ్రీప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో మంత్రి గారి మరియు వారి కుటుంబ సభ్యుల నామధేయాలతో, గోత్రనామాలతో ప్రత్యేక అర్చన మరియు పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. మంత్రివర్యుల కు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వ ర్యాలతో తులతూగాలని, ప్రజలకు మరిన్ని ఉన్నతమైన సేవలు అందించాలని ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ పూజా కార్యక్రమాల అనంతరం, స్థానిక శ్రీరామకృష్ణపురం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు రోగులకు పేదలకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో డా. కానాల సాయి కిరణ్ మరియు వైద్య సిబ్బంది. స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూ రిలక్ష్మీనరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల శ్యాంసుందర్రావు ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, రాష్ట్ర కోశాధికారి ఊరే ప్రసాదరావు ,రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవులపల్లిఅశోక్ కుమార్ ,ప్రచార కార్యదర్శి గూడ జయరాం ప్రముఖ సినీ దర్శకుడు ఆదిత్య, వింజమూరి మనోహర్రావు, రాష్ట్ర బ్రాహ్మణ మహిళ నాయకురాలు అబ్బరాజు రూప, సాయి ప్రశాంత్ మరియు జిల్లా కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి , పున్న గణేష్ నేత ,ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం అధ్యక్షులు తలాటి రమేష్ నేత శ్రీ రాజేశ్రీ. రామారావు., సాయికు మార్,బి, వెంకటేశ్వర్లు, హేమాద్రి శ్రీనివాస్ కాలనీకి చెందిన ప్రముఖులు, పెద్ద సంఖ్యలో మహిళలు, సీనియర్ సిటిజన్లు మరియు కాలనీ వాసులు అత్యంత ఉత్సాహంతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మక్కల కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిర్మల్ జిల్లా వరి కొనుగోళ్లు కూడా వేగవంతం ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

-రైతులు ఆందోళన చెందవద్దు

-జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



హంసకలం వార్త మే 30

నిర్మల్ జిల్లాలోని యాసంగి సీజన్‌కు సంబంధించిన మక్కలు,వరి,జొన్నల కొనుగోళ్లు రవాణా ప్రక్రియలు వేగవంతంగా కొనసాగుతున్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న,వరి,జొన్నల కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని అన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

-మక్కల కొనుగోళ్లలో రికార్డు

మే 31 నాటికి 1.10 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400 ఉండటంతో రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకువచ్చారని తెలిపారు. బహిరంగ మార్కెట్లో క్వింటాలుకు రూ.1,700--1,800 మాత్రమే లభిస్తుండగా, ప్రభుత్వ కొనుగోళ్ల ద్వారా రైతులకు అధిక లాభం చేకూరిందన్నారు.

రైతుల విజ్ఞప్తి మేరకు కేంద్రాలకు వచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేయడం ద్వారా మే 30 నాటికే 1.61 లక్షల మెట్రిక్ టన్నుల మక్కల కొనుగోలు పూర్తిచేసి రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు.

-మక్కల రవాణా శరవేగం

ఇప్పటివరకు 1.34 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను గోదాములకు తరలించగా,సుమారు 30 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రాల్లో మిగిలి ఉన్నాయని తెలిపారు. రోజుకు 5 నుంచి 6 వేల మెట్రిక్ టన్నుల చొప్పున రవాణా కొనసాగుతోందని,జూన్ 2 నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. వర్షాల నేపథ్యంలో మక్కలు తడిసి మొలకెత్తే ప్రమాదం ఉన్నందున వరి కంటే మక్కల రవాణాకే ప్రాధాన్యత ఇస్తున్నామని,ఒక్క కిలో కూడా నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

-వరి కొనుగోళ్లు ముమ్మరం

జిల్లాలో 1.80 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా,ఇప్పటివరకు 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గతేడాది కూడా ఇదే స్థాయిలో కొనుగోళ్లు జరిగాయని గుర్తు చేశారు.ఇప్పటివరకు 80 నుంచి 85 వేల మెట్రిక్ టన్నుల వరిని గోదాములకు తరలించామని, ప్రస్తుతం రోజుకు 6 నుంచి 7 వేల మెట్రిక్ టన్నుల వరి రవాణా జరుగుతోందన్నారు. మక్కల రవాణా పూర్తయిన తర్వాత అదనపు లారీలు, హమాలీలను వరి రవాణాకు వినియోగించి రోజువారీ సామర్థ్యాన్ని 9 వేల మెట్రిక్ టన్నుల వరకు పెంచుతామని తెలిపారు.

-వర్షాలపై ముందస్తు చర్యలు

రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రోడ్లపై, లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని గుర్తించి రక్షణ చర్యలు చేపట్టామని, ఇప్పటివరకు ఒక్క బస్తా ధాన్యం కూడా తడవలేదని చెప్పారు.ఒకవేళ భారీ వర్షాలు కురిసినా ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని స్పష్టం చేశారు.

-జొన్నల కొనుగోళ్లకు సన్నద్ధం

జిల్లాలో జొన్నల కొనుగోలు కోసం 13 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మక్కల కొనుగోళ్లు పూర్తయిన వెంటనే జొన్నల కొనుగోళ్లను ముమ్మరం చేయనున్నట్లు చెప్పారు. క్వింటాలుకు రూ.3,700 మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా 35 వేల నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోళ్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు.జొన్నల నిల్వ కోసం ఇప్పటికే 20 నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను సిద్ధం చేశామని, జూన్ 10 లేదా 11 నాటికి కొనుగోళు , రవాణా పూర్తవుతాయని తెలిపారు.

-గోదాముల సామర్థ్యం పెంపు

భారీ స్థాయిలో పంట కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో గోదాముల కొరత తలెత్త కుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1.90 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. లోకేశ్వరం,కడెం మండలాల్లో అదనపు గోదాములను గుర్తించి వినియోగంలోకి తీసుకువచ్చామని, రైతుల పంట భద్రతకు పూర్తి స్థాయిలో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్,మార్క్‌ఫెడ్ డీఎం మహేష్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్,ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిజినెస్

# క్లెయిమ్ చేయని డిపాజిట్ల కోసం ప్రత్యేక పోర్టల్




**న్యూఢిల్లీ:** బ్యాంకు డిపాజిట్లు, బీమా క్లెయిమ్‌లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ యూనిట్లు క్లెయిమ్ చేయడం మర్చిపోయారా? డోంట్ వర్రీ. మీ ఆధార్, పాన్ వంటి వివరాలు ఉంటే చాలు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనే పోర్టల్ ద్వారా వాటి ఆచూకీ కనిపెట్టి క్లెయిమ్ చేసుకోవచ్చు. శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ఆర్థిక సేవల విభాగం (డీఎ?ఫఎస్) కార్యదర్శి ఎం నాగరాజు ఈ పోర్టల్‌ను ప్రారంభించారు. పీఎ?సబీ అలయెన్స్‌తో కలిసి ఆర్థిక సేవల విభాగం ఈ పోర్టల్‌ను ప్రారంభించింది. ఆర్థిక ఆస్తుల వివరాలు మర్చిపోయిన మదుపరులకు ఈ పోర్టల్ ఉపయోపడనుంది.

# యుద్ధం.. క్షామం!

**వార్షిక నివేదికలో హెచ్చరించిన ఆర్‌బీఐ**

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) భారత ఆర్థిక వ్యవస్థపై సానుకూల దృక్పథంతోనే ఉన్నప్పటికీ, పశ్చిమాసియాలో సంక్షోభంతో పెరిగిన ఇంధన ధరలు, సరఫరా వ్యవస్థలో అవాంతరాలు ఆర్థిక పురోగతికి ప్రతిబంధకంగా మారటంతో పాటు ద్రవ్యోల్బణం అదుపు తప్పవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) హెచ్చరించింది. అలాగే, ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం సాధారణ స్థాయి కంటే తగ్గవచ్చున్న అంచనాల నేపథ్యంలో వ్యవసాయ ఉత్పత్తికి కూడా గండి పడవచ్చని శు క్రవారం విడుదల చేసిన 2025-26 ఆర్థిక సంవత్సర నివేదికలో ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. అయినప్పటికీ, కార్పొరేట్ కంపెనీలు, బ్యాంకుల మెరుగైన పనితీరు, ప్రభుత్వ మూలధన పెట్టుబడులు, అమెరికా సహా కీలక భాగస్వాములతో వాణిజ్య ఒప్పందాలు జీడీపీ వృద్ధి, పెట్టుబడుల జోరు కొనసాగేందుకు దోహదపడవచ్చని ఆర్‌బీఐ ఆశాభావం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ అనిశ్చితులోనూ భారత ఆర్థిక వ్యవస్థ గత ఆర్థిక సంవత్సరంలో చురుకుగా పురోగమించిందని.. సమృద్ధిగా వస్తు వినియోగం, పెట్టుబడులతో పాటు బలమైన ఆర్థిక మూలాలు ఇందుకు తోడ్పడ్డాయని రిపోర్టు పేర్కొంది.

**జీడీపీ వృద్ధి 6.9 శాతం, ద్రవ్యోల్బణం 4.6 శాతం.**

ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతల నమోదవడంతో పాటు ఎల్ నినో అవకాశాలున్నప్పటికీ సరిపడా ఆహార ధాన్యాల నిల్వలు, నీటి రిజర్వాయర్ స్థాయిల సాయంతో రిటైల్ ధరల ద్రవ్యోల్బణం అంచనాలకు అనుగుణంగా ఉండవచ్చని ఆర్‌బీఐ రిపోర్టు పేర్కొంది. అయితే, పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా భారీగా పెరిగిన ఇంధన, కమోడిటీ ధరలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ఫలితంగా ఉత్పత్తి వ్యయం పెరుగుదల, రూపాయి క్షీణత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత 2026-27లో సగటు ద్రవ్యోల్బణాన్ని అప్‌సైడ్ రిస్క్‌తో 4.6 శాతంగా అంచనా వేసింది. అలాగే, జీడీపీ వృద్ధి రేటును డౌన్‌సైడ్ రిస్క్‌తో 6.9 శాతంగా అంచనా వేసింది.




**ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్‌లో 20.6% వృద్ధి**

2024-25 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.76,25,421.93 కోట్లుగా ఉన్న ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్.. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి రూ.15,71,699.15 కోట్ల (20.6 శాతం) పెరుగుదలతో రూ.91,97,121.08 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా పెట్టుబడులు 44.9 శాతం, పసిడిలో పెట్టుబడులు 63.8 శాతం, విదేశీ పెట్టుబడులు 7.9 శాతం పెరగడం ఇందుకు దోహదపడిందని వెల్లడించింది.

**విదేశీ మారక లావాదేవీల నుంచి.. రూ.1.69 లక్షల కోట్ల ఆదాయం..**

గత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐకి విదేశీ మారకం (ఫారెక్స్) లావాదేవీలపై ఆదాయం దాదాపు 52 శాతం వృద్ధితో రూ.1.69 లక్షల కోట్లకు పెరిగింది. 2024-25లో రూ.1.11 లక్షల కోట్లుగా నమోదైంది. కాగా, 2025-26లో విదేశీ సెక్యూరిటీలపై గడించిన వడ్డీ ఆదాయం రూ.1.07 లక్షల కోట్లకు చేరుకుంది.

**డిజిటల్ రూపీ చెలామణి తగ్గింది..**

చలామణిలో ఉన్న రిటైల్ డిజిటల్ రూపీ (సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ) గత ఆర్థిక సంవత్సరంలో 24.08్న తగ్గి రూ.771.66 కోట్లకు పరిమితమైంది. 2024-25లో ఈ విలువ రూ.1,016.46 కోట్లుగా ఉంది. టోకు డిజిటల్ రూపీ చలామణి మాత్రం సున్నాగా ఉంది. డిజిటల్ రూపీతో విదేశీ లావాదేవీలు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విదేశీ లావాదేవీలకూ డిజిటల్ రూపీని అందుబాటులో తేవాలని ఆర్‌బీఐ భావిస్తోంది. అలాగే, కేంద్రం, రాష్ట్రాలకు చెందిన మరిన్ని ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలు, దేశీయంగా రిటైల్ లావాదేవీల్లోనూ డిజిటల్ రూపీని వినియోగించాలని యోచిస్తున్నది.

**రూ.48,021 కోట్ల బ్యాంకింగ్ మోసాలు**

గత ఆర్థిక సంవత్సరం దేశీయ బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థల్లో రూ.48,021 కోట్ల విలువైన 10,114 మోసాలు జరిగాయని ఆర్‌బీఐ వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.32,803 కోట్ల విలువ చేసే 23,722 మోసం కేసులు నమోదయ్యాయి. గత మూడేళ్ల డేటాను పరిశీలిస్తే.. మోసం కేసుల సంఖ్య తగ్గుతుండగా.. మోసపోయిన సొమ్ము విలువ గణనీయంగా పెరిగిందని పేర్కొంది.

**880.52 మెట్రిక్ టన్నుల పసిడి నిల్వలు**

ఆర్‌బీఐ వద్దనున్న బంగారం నిల్వలు 2025 మార్చి 31 నాటికి 879.58 మెట్రిక్ టన్నులుగా నమోదు కాగా.. 2026 మార్చి 31 నాటికి 880.52 టన్నులకు పెరిగాయి. అంటే, గత ఆర్థిక సంవత్సరం ఆర్‌బీఐ కేవలం 0.94 మెట్రిక్ టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది.

# రూ1.10 కోట్ల పెట్టుబడికి రూ.34 కోట్లకు పైగా ఫలితం!





**ఇంటర్నెట్ డెస్క్:** అత్యద్భుతమైన బ్యాటింగ్‌తో ఈ ఐపీఎల్ సీజన్లో అదరగొట్టిన వైభవ్ సూర్యవంశీ.. రాజస్థాన్ రాయల్స్‌కు భారీ విలువను చేకూర్చాడు. గతేడాది రూ.1.1 కోట్లు చెల్లించి వైభవ్‌ను సొంతం చేసుకున్న ఆర్‌ఆర్.. ఈ సీజన్‌లో అతడి ఆట ద్వారా రూ.34.97 కోట్లు పొందినట్టు విశ్లేషకులు అంచనా వేశారు. అంటే అతడికి చెల్లించిన మొత్తం పోనూ.. రూ.33.87 కోట్లు అన్నమాట. బాల్-బై-బాల్ డేటా ఆధారంగా ప్రత్యేక ప్లేయర్ ఇంపాక్ట్ మోడల్ ప్రకారం ఈ గణాంకాలను రూపొందించినట్టు తెలుస్తోంది. వైభవ్ తన ఆటతీరుతో ప్రతి రూపాయికి రూ.31.79 విలువను ఆర్‌ఆర్ జట్టుకు అందించినట్లు ఈ గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది. అత్యధిక లాభం అందించిన ఆటగాళ్ల జాబితాలో వైభవ్ మూడో స్థానంలో నిలిచాడు. అతని కంటే ముందున్న శుభ్‌మన్ గిల్(రూ.16.5 కోట్లు), రజత్ పాటిదార్(రూ.11 కోట్లు)కు ఆయా ఫ్రాంచైజీలు భారీ ధరలు వెచ్చించినప్పటికీ.. వైభవ్ మాత్రం తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను అందించాడు. ఇక జీటీ కెప్టెన్ శుభ్‌మన్ రూ.35.14 కోట్లు తెచ్చిపెట్టగా, ఆర్సీబీ సారథి పాటిదార్ రూ.35.06 కోట్లు సాధించేలా చేశాడు. మరోవైపు.. రిషబ్ పంత్(రూ.27 కోట్లు), నికోలస్ పూరన్ (రూ.21 కోట్లు), యుజ్వేంద్ర చాహల్ (రూ.18 కోట్లు), జస్ప్రీత్ బుమ్రా (రూ.18 కోట్లు) ఈ సీజన్‌లో తమ ఫ్రాంచైజీలకు నష్టాలను మిగిల్చారు. ఇక.. 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు చేసిన సూర్యవంశీ.. అందులో 521 పరుగులను పవర్‌ప్లే ఓవర్లలోనే సాధించడం విశేషం. ప్రత్యర్థి బౌలర్లపై ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించడం ఈ బుడ్డోడి ప్రత్యేకత. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 36 బంతుల్లో శతకం సాధించి ఐపీఎల్ చరిత్రలో మూడో వేగవంతమైన సెంచరీ నమోదు చేశాడు. అదే జట్టుపై ఎలిమినేటర్‌లో 29 బంతుల్లో 97 పరుగులతో చెలరేగి.. తమ జట్టు క్వాలిఫయర్‌కు అర్హత సాధించేలా చేశాడు. ఇక.. ఈ సీజన్‌లో వైభవ్ పుల్‌షాట్ ప్రత్యేకాకర్షణగా నిలిచిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఆ షాట్‌తో 20 సిక్సర్లు బాదిన ఈ చిచ్చర పిడుగు.. ఒక్కసారి మాత్రమే అలాంటి షాట్‌కు ఔటయ్యాడు. అతడు ఎదుర్కొన్న 44 మంది బౌలర్లలో 31 మందిని సిక్సర్లతో శిక్షించడం, వారిలో ఎనిమిది మంది బౌలింగ్‌లో ఎదుర్కొన్న తొలి బంతికే సిక్సర్ బాదడం అతడి దూకుడుకు నిదర్శనం. కాగా.. 13 ఏళ్ల వయసులో ఐపీఎల్‌లో అడుగుపెట్టిన ఈ యువ సంచలనం.. భవిష్యత్తులో జరిగే మెగా వేలంలో రూ.15-18 కోట్లకు పైగా ధర పలికే అవకాశముందని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## స్పోర్ట్స్

# అరుదైన మైలురాయి...

## టీమిండియా సరసన పాకిస్థాన్



**స్పోర్ట్స్ డెస్క్:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు ఓ అరుదైన మైలురాయిని అందుకుంది. రావల్పిండి వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి వన్డే పాకిస్థాన్‌కు 1000వ మ్యాచ్ కావడం విశేషం. ఈ నేపథ్యంలో వన్డే క్రికెట్‌లో వెయ్యి మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న మూడో జట్టుగా పాకిస్థాన్ నిలిచింది. తొలి స్థానంలో భారత జట్టు ఉంది. వెయ్యి వన్డే మ్యాచ్‌లు ఆడిన జట్ల జాబితాలో టీమిండియా మొదటి స్థానంలో ఉంది. ఇప్పటి వరకు భారత్ 1075 వన్డే మ్యాచ్‌లు ఆడింది. అలానే 1020 మ్యాచ్‌లతో ఆస్ట్రేలియా రెండో స్థానంలో కొనసాగుతోంది. తాజాగా ఈ రెండు దేశాల సరసన పాకిస్థాన్ చేరింది. 1000వ మ్యాచ్ ఆడుతున్న సందర్భంగా పాక్ కెప్టెన్ షాహిన్ అఫ్రిది ఆస్ట్రేలియా స్టాండ్ ఇన్ కెప్టెన్ జోస్ ఇంగ్లిస్ చేతుల మీదుగా ప్రత్యేక మెమొంటో అందుకున్నాడు. పాక్ ఆడుతున్న ఈ1000వ మ్యాచ్ ద్వారా అరాఫత్ మిన్హాస్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేస్తున్నాడు. వెయ్యి వన్డే మ్యాచ్‌లు ఆడిన మూడు జట్లు విజయాల శాతాన్ని పరిశీలిస్తే.. ఆస్ట్రేలియా (1020 మ్యాచ్‌ల్లో 617 విజయాలు, 52.7 శాతం) తొలి స్థానంలో ఉండగా, భారత్ (1075 మ్యాచ్‌ల్లో 571 విజయాలు), పాకిస్థాన్ (999 మ్యాచ్‌ల్లో 527 విజయాలు) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. పాకిస్థాన్ తమ మొట్టమొదటి వన్డేను 1973లో ఫిబ్రవరి 11న న్యూజిలాండ్‌తో ఆడింది. 1000 వన్డేలను పూర్తి చేయడానికి పాక్‌కు 53 సంవత్సరాలు పట్టింది. ఈ 53 ఏళ్ల కాలంలో పాకిస్థాన్ 12 ప్రపంచ కప్‌లు ఆడింది. తొలిసారి 1975 వరల్డ్ కప్‌లో పాక్ పాల్గొన్నది. 1992లో మాత్రమే ప్రపంచ కప్ టైటిల్‌ను గెలుచుకుంది పాక్.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
ఆదివారం 31 మే 2026

# ‘కరికాడ’ (అమెజాన్ ప్రైమ్)
# మూవీ రివ్యూ!



కన్నడలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ ‘కరికాడ’. నటరాజ్ హీరోగా ఆయన సొంత బ్యానర్లో ఈ సినిమా నిర్మితమైంది. యశ్ శెట్టి కీలకమైన పాత్రను పోషించిన ఈ సినిమాలో,నిరీక్ష శెట్టి కథానాయికగా కనిపిస్తుంది. వెంకటేశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీన థియేటర్లకు వచ్చింది. అలాంటి ఈ సినిమా ఈ నెల 29వ తేదీ నుంచి ‘అమెజాన్ ప్రైమ్’ లో స్ట్రీమింగ్ అవుతోంది. కన్నడతో పాటు తెలుగులోను అందుబాటులోకి వచ్చింది.

అది అడవిని ఆనుకుని ఉన్న ఒక మారుమూల గ్రామం. ఆ గ్రామానికి ఓ మోతుబరి రైతు భూపతి (బల్ రాజ్) ప్రెసిడెంట్ గా ఉంటాడు. అతనికి మల్లి (యశ్ శెట్టి) కాంత (విపిన్ ప్రకాశ్) అనే ఇద్దరు కొడుకులు ఉంటారు. ఇక జార్జ్ అనే యువకుడు కూడా ప్రెసిడెంట్ కి నమ్మకస్తుడిగా ఉంటాడు. ప్రెసిడెంట్ మేనకోడలు ‘కనక’ ( నిరీక్ష) ఆ ఇంట్లోనే పెరుగుతుంది. ఆమె పేరుతో భూమి ఉండటం వలన, తన కొడుకు ‘కాంత’కి ఇచ్చి పెళ్లి చేయాలని భూపతి నిర్ణయించుకుంటాడు. అయితే ఆమె ‘కాడ’ను ఇష్టపడుతూ ఉంటుంది.

‘కాడ’కి వయసు పైబడిన తండ్రి తప్ప మరెవరూ లేరు. అతను తన కష్టాన్ని నమ్ముకుని బ్రతుకుతుంటాడు. అడవి పందులను వేటాడటంలో ఆయనకి మంచి నైపుణ్యం ఉంటుంది. చేనులోకి అడవిపందులు రాకుండా అతను కాపలా కాస్తూ ఉంటాడు. అక్కడ అతనిని ‘కనక’ రహస్యంగా కలుస్తూ ఉంటుంది. అయితే ఆమె కలవారి అమ్మాయి కావడం వలన, కాడ పెద్దగా ఆసక్తిని చూపించడు. ఆమె మనసులో ఏముందనేది భూపతికి అర్థమైపోతుంది. ‘కనక’ గనుక ‘కాడ’ను పెళ్లి చేసుకుంటే తన కుటుంబ పరువు ప్రతిష్ఠలు దెబ్బతింటాయి. అంతేకాదు కనక పేరుతో ఉన్న భూమి తన చేజారిపోతుందని భూపతి భావిస్తాడు. అందువలన కాడ అడ్డు తొలగించుకోవాలని భావిస్తాడు. అందుకోసం అతను తన ఇద్దరు కొడుకులను రంగంలోకి దింపుతాడు. ఆ ముగ్గురూ కలిసి ఏం చేస్తారు? వారి కారణంగా ‘కాడ’కి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనేది మిగతా కథ.

# అసలు సిసలైన హారర్ మూవీ

## 38 సెకన్ల ఫుటేజికి కత్తెర వేసిన భారత సెన్సార్ బోర్డు

**హారర్ చిత్రం ‘అబ్సెషన్’కు ‘సర్టిఫికెట్ ఇచ్చినా సెన్సార్ కోతలు**
**హింస, శృంగార సన్నివేశాల్లో 38 సెకన్ల నిడివికి కత్తెర**
**సెన్సార్ బోర్డు తీరుపై సోషల్ మీడియాలో ఫ్యాన్స్ తీవ్ర అసంతృప్తి**
**థియేటర్లలో కంటే ఓటీటీలో అన్‌కట్ వెర్షన్ చూస్తామంటున్న నెటిజన్లు**




ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న హాలీవుడ్ హారర్ చిత్రం ‘అబ్సెషన్’కు భారత సెన్సార్ బోర్డు షాకిచ్చింది. ఈ చిత్రానికి ‘ఏ’ (అడల్ట్స్ ఓన్లీ) సర్టిఫికెట్ జారీ చేసినప్పటికీ, పలు కీలక సన్నివేశాలపై కత్తెర వేసింది. కర్రీ బార్కర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా మే 29న భారత థియేటర్లలో విడుదలైంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఆదేశాల మేరకు ఈ చిత్రంలో మొత్తం 38 సెకన్ల నిడివి గల సన్నివేశాలను తొలగించారు. ఇందులో సినిమా ద్వితీయార్ధంలో వచ్చే 24 సెకన్ల తీవ్రమైన హింసాత్మక సన్నివేశం, 14 సెకన్ల నిడివి గల శృంగారభరిత సన్నివేశం ఉన్నాయి. వీటితో పాటు ఒక నగ్న దృశ్యాన్ని కూడా వేరే షాట్‌తో భర్తీ చేశారు. ఈ కోతల అనంతరం సుమారు 1 గంట 50 నిమిషాల నిడివితో సినిమా ప్రదర్శితమవుతోంది.


అంతర్జాతీయంగా సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ‘అబ్సెషన్’ భారీ విజయం సాధించడంతో భారతీయ హారర్ ప్రియులు సినిమాపై ఎన్నో అంచనాలు పెట్టుకున్నారు. అయితే, ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చాక కూడా కీలక సన్నివేశాలను తొలగించడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెద్దల కోసం ఉద్దేశించిన సినిమాలో ఈ కోతలు ఎందుకని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు.

థియేటర్లలో సెన్సార్ చేసిన వెర్షన్ చూసే బదులు, ఓటీటీలో పూర్తి సినిమా (అన్‌కట్ వెర్షన్) కోసం ఎదురుచూస్తామని పలువురు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

చిత్రంలోని హింస, శృంగార సన్నివేశాలు భారతీయ ప్రేక్షకులకు తగినవి కావని ఎగ్జామినింగ్ కమిటీ భావించినట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతానికి ఓటీటీలో అన్‌కట్ వెర్షన్ రిలీజ్‌పై ఎలాంటి స్పష్టత లేదు. ఈ ఘటనతో అంతర్జాతీయ చిత్రాల సెన్సార్‌షిప్‌పై మరోసారి చర్చ మొదలైంది.

# కాలేజీల్లో సినిమా ప్రమోషన్స్ దండగ..

**డిజిటల్ మీడియానే ముఖ్యం: పృథ్వీరాజ్**
**ఇండస్ట్రీలో ప్రమోషన్ల ట్రెండ్‌ను తప్పుబట్టిన పృథ్వీ**
**కాలేజీల్లో స్టూడెంట్స్‌ను కలవడం వేస్ట్ అని వ్యాఖ్య**
**ఒక్కడు కూడా థియేటర్ కి వచ్చి సినిమా చూడడన్న పృథ్వీ**



‘30 ఇయర్స్ ఇండస్ట్రీ’ డైలాగ్‌తో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు పృథ్వీరాజ్ తాజాగా మూవీ ప్రమోషన్స్ విధానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా జరిగిన ‘రిస్క్’ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన... ప్రస్తుత చిత్ర పరిశ్రమలో ప్రచారాల పేరిట జరుగుతున్న ట్రెండ్‌ను తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మధ్య కాలంలో ప్రతి ఒక్కరూ సినిమా ప్రమోషన్స్ అంటూ భారీగా ఖర్చు చేస్తూ, కాలేజీల చుట్టూ తిరుగుతూ స్టూడెంట్స్‌ను కలుస్తున్నారని పృథ్వీరాజ్ పేర్కొన్నారు. అయితే, అక్కడ గోల, ఈలలు, అరుపులు తప్ప.. ఒక్క విద్యార్థి కూడా తర్వాత థియేటర్ కి వచ్చి సినిమా చూడటం లేదని ఆయన తన వ్యక్తిగత అభిప్రాయాన్ని తెలియజేశారు. కాలేజీలకు వెళ్లి ప్రమోషన్ల పేరిట డబ్బును వృథాగా తగలెయ్యొద్దని ఆయన సూచించారు. ఆ ఖర్చుకు బదులుగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను సరైన పద్ధతిలో ఉపయోగించుకుని, సినిమాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని హితవు పలికారు.

# సీఎం విజయ్ కుమారుడి సినిమా రిలీజ్ డేట్ వచ్చేసింది!

**-తమిళ నటుడు విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకత్వంలో వస్తున్న ‘సిగ్మా’**
**-ప్రపంచవ్యాప్తంగా జూలై 31న సినిమా విడుదల**
**-సందీప్ కిషన్ హీరోగా చిత్రం... లైకా ప్రొడక్షన్స్ నిర్మాణం**
**-తమిళ-తెలుగు భాషల్లో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతున్న వైనం**
**ప్రస్తుతం వేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు**






తమిళ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి థలపతి విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న ‘సిగ్మా’ సినిమా విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని జూలై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని లైకా ప్రొడక్షన్స్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. “సిగ్మా జూలై 31న థియేటర్లలోకి వస్తోంది. ఈ అద్భుతమైన ప్రయాణానికి సిద్ధంగా ఉండండి” అని పోస్ట్ చేసింది. తెలుగు యంగ్ హీరో సందీప్ కిషన్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తుండటం విశేషం. తమిళ, తెలుగు భాషల్లో ఏకకాలంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఫరియా అబ్దుల్లా ఓ ముఖ్య పాత్రలో నటిస్తుండగా, తమన్ సంగీతం సమకూరుస్తున్నారు. యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ఉండబోతోందని సమాచారం. 25 ఏళ్ల జేసన్ సంజయ్, కెనడా మరియు లండన్‌లలో ఫిల్మ్ మేకింగ్ కోర్సులు పూర్తి చేసిన తర్వాత దర్శకత్వం వైపు అడుగులు వేశారు. 2023 ఆగస్టులో ప్రకటించిన ఈ సినిమా షూటింగ్ 65 రోజుల్లో పూర్తయింది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. సుభాస్కరన్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటోంది. విజయ్ కుమారుడి తొలి సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో, ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449